

29న మంత్రి లోకేశ్ రాక

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఈనెల 29వ తేదీన నగరానికి రానున్నారు. ఆరోజు రాత్రి పార్టీ కార్యాలయంలో బస చేసి, 30న నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదేరోజు ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ నడుమ జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు హాజరయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.



'ది డెక్'లో టాటా ఇన్నోవేషన్ సెంటర్

50 వేల చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు

- నెల రోజుల్లో ప్రారంభం
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడి

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఐటీ అభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించడానికి ఉద్దేశించిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ కేంద్రాన్ని విశాఖపట్నంలో ఏర్పాటుచేయనుంది. సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం...'ది డెక్'లో ఇందుకోసం 50 వేల చ.అ. విస్తీర్ణంలో రెండు నుంచి మూడు అంతస్థులు కేటాయించనున్నారు. అమరావతిలో కలెక్టర్లతో సీఎం చంద్రబాబునాయుడు బుధవారం నిర్వహించిన సమావేశంలో దీనిపై చర్చ జరిగింది. భవనం సిద్ధంగా ఉందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించడంతో నెల రోజుల్లోనే దానిని ప్రారంభిస్తామని సీఎం ప్రకటించారు. రెండు రోజుల క్రితమే స్టార్టప్ పాలసీని ప్రకటించిన ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రధాన కేంద్రం విజయవాడలో ఉంటుందని, దానికి అనుబంధంగా విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, అనంతపురంలలో స్పోక్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. ఆ మేరకు విశాఖలో సబ్ సెంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.



సిరిపురంలో వీఎంఆర్‌డీఏ నిర్మించిన భవనం

ఆర్థిక వృద్ధికి ప్రణాళికలు

సర్వీస్ సెక్టార్, ఉత్పత్తి, వ్యవసాయ రంగాలపై ప్రధాన దృష్టి

- ఏడాదిలో మెట్రో రైలు ప్రాజెక్టు తొలిదశకు భూసేకరణ పూర్తి చేసి టెండర్లు ఆహ్వానిస్తాం
- తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తాం
- గ్రోత్‌హబ్ లక్ష్యాలు చేరుకుంటాం
- కొత్తవంగడాలు, వినూత్న పద్ధతుల ద్వారా వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెంపు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్



విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాను ఆర్థికంగా మరింత పటిష్ఠవంతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని, అందుకు ప్రధానంగా సర్వీస్ సెక్టార్, ఉత్పత్తి, వ్యవసాయ రంగాలపై దృష్టిసారించి తగిన ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరుగుతున్న సదస్సులో రెండో రోజు బుధవారం కలెక్టర్ 2025-26లో జిల్లా సమగ్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్పత్తి రంగంలో కీలకమైన ప్రాజెక్టులు పట్టాలు ఎక్కేలా ముందుకు వెళుతున్నామన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశకు అవసరమైన భూసేకరణ పూర్తిచేసి, వచ్చే 12 నెలల్లో టెండర్లు ఆహ్వానిస్తామన్నారు. నగరంలో ... మిగతా 6వ పేజీలో

విశాఖలో ఐదు వేల హోటల్ గదులు

ఉత్తరాంధ్ర జిల్లాలతో కలిసి గుర్తించిన గ్రోత్ హబ్‌కు విశాఖ నగరం కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా విశాఖలో ఆతిథ్య రంగం విస్తరించాలని, ఐదు వేల హోటల్ గదులు సామర్థ్యం ఉండాలని విశాఖ కలెక్టర్‌కు సూచించారు.

కల్చరల్ సెంటర్

విశాఖ నగరంలో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు. అందుకోసం కల్చరల్ సెంటర్ ఒకటి ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

పంచ గ్రామాల సమస్యపై సీఎం ఆరా

- ఇంకా పరిష్కారం కాకపోవడంపై సీరియస్
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హితవు

సింహాచలం పంచ గ్రామాల సమస్యపై కలెక్టర్‌ను సీఎం చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. ఎంతవరకూ వచ్చిందని అడగ్గా, ఫైల్ న్యాయ శాఖలో ఉన్నదని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమాధానమిచ్చారు. దాంతో సీఎం న్యాయ శాఖ సెక్రటరీని ప్రశ్నించారు. ప్రతి అంశాన్ని ఫోన్ చేసి అడగలేమని, ఎవరు చేయాల్సిన పని వారు బాధ్యతగా సరైన సమయంలో పూర్తిచేయాలని చెప్పారు. అధికారుల అలసత్వం వల్ల ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పరిష్కారం చూపకుండా ఫైల్‌ను కింది నుంచి పైకి, పై నుంచి కిందికి తిప్పితే ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. ఇలాంటి విషయాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పనులు ఎలా చేయించుకోవాలో మంత్రులు నేర్చుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటే వెంటనే దానిని అమలు చేసే విధంగా ప్రత్యేక ఆదేశాలు ఇవ్వాలని చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు సూచించారు.

పేదల కాలనీలో పెద్దోళ్లకు ఇళ్లు!

జెర్రిపోతులపాలెం జగనన్న కాలనీలో అడ్డగోలుగా కేటాయింపులు

- ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, సైనికులకు మంజూరు
- వైసీపీ నేత ప్రోద్బలంతోనే...
- స్థానికులు ఫిర్యాదు చేసినా గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోని వైనం
- తాజాగా విచారణ
- మొత్తం 134 మందిలో 60 మంది అనర్హులు ఉన్నట్టు గుర్తింపు



జెర్రిపోతులపాలెంలోని ఇళ్ల కాలనీ

విశాఖపట్నం, పెందుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):

పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెం జగనన్న కాలనీలో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, సైనికులకు అడ్డగోలుగా ఇళ్లు మంజూరుచేసిన విషయం వెలుగులోకి వచ్చింది. రెండస్థుల ఇళ్లు, కార్లు ఉన్నవారికి కూడా గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు కేటాయించేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ప్రస్తుతం రీవెరిఫికేషన్ చేయించగా 60 మంది అనర్హులు ఉన్నట్టు తేలింది. వివరాల్లోకి వెళితే...

పేదలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు జెర్రిపోతులపాలెంలో 1.5 సెంట్ల చొప్పున 134 మందికి ప్లాట్లు సిద్ధం చేశారు. హౌసింగ్ స్కీమ్‌కు నాలుగు చక్రాల వాహనం కలిగినవారు, గ్రామీణ ప్రాంతంలో సొంత ఇల్లు ఉన్నవారు, కరెంట్ నెలకు 300 యూనిట్లు మించి వినియోగించేవారు, ప్రభుత్వ ఉద్యోగులు/పింఛన్‌దారులు అనర్హులు. అయితే అప్పటి అధికారులు నిబంధనలేవీ పాటించకుండా గ్రామంలో వైసీపీ నేత ఒకరి ప్రోద్బలంతో 134 మందితో జాబితాను ఆమోదించి గృహ నిర్మాణ సంస్థకు పంపారు. గ్రామానికి ఆనుకుని లేఅవుట్ వేశారు. ఇళ్లు మంజూరైన వారిలో నేవల్ డాక్‌యార్డు ఉద్యోగులు, సైనికులు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైరై పింఛన్ తీసుకుంటున్నవారు ఉన్నారు. అందరూ భార్య పేరిట ఇల్లు తీసుకున్నారు. అనర్హులకు ఇళ్లు మంజూరుచేయడంపై అప్పట్లో గ్రామానికి ... మిగతా 6వ పేజీలో

క్లౌడ్ కిచెన్స్ ఇష్టారాజ్యం

నగర పరిధిలో దాదాపు 200కుపైగా ఏర్పాటు

- మూడొంతులు అనుమతులు లేనివే...
- జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదులు
- ఆహార భద్రత, ప్రమాణాల శాఖ దాడుల్లో అనేక లోపాలు బహిర్గతం
- పరిశుభ్రత లేకపోవడం, నాసిరకం ఆహార పదార్థాల వినియోగం
- నమూనాలు సేకరించి పరీక్షలకు పంపిన అధికారులు



క్లౌడ్ కిచెన్‌లో పదార్థాలను పరిశీలిస్తున్న ఆహార తనిఖీ అధికారులు (ఇన్‌సెట్‌లో) పంపిణీకి సిద్ధంగా ఆహార పదార్థాలు

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):

నగరంలో ఫుడ్ బిజినెస్ బాగా నడుస్తుండడంతో క్లౌడ్ కిచెన్లు భారీగా ఏర్పాటవుతున్నాయి. ఆన్‌లైన్ ఆర్డర్స్ ఆధారంగా సాగే ఈ కిచెన్స్ గడిచిన రెండేళ్లలో పది రెట్లకుపైగా పెరిగాయి. ప్రస్తుతం నగర పరిధిలో 200కుపైగా ఉన్నాయి. అయితే అత్యధికం అనుమతులు లేకుండా నడుస్తున్నాయి.

క్లౌడ్ కిచెన్స్ ఏర్పాటుచేయాలంటే కొన్ని రకాల అనుమతులు తీసుకోవాలి. అయితే ఇప్పటివరకూ 50 మందికి మాత్రమే అధికారులు అనుమతులు ... మిగతా 6వ పేజీలో

వైద్యులు సమయపాలన పాటించాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఫీల్డ్‌కు వెళితే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదుచేయాలి

- లేనిపక్షంలో చర్యలు తప్పవు
- సిబ్బందికి కూడా అదే వర్తిస్తుంది
- ఆరోగ్య కేంద్రాల పనితీరు మెరుగుపర్చేందుకు కృషిచేస్తున్నాం
- నాలుగు ఇండికేటర్స్ అమలు చేసేలా వైద్యులు, సిబ్బందికి ఆదేశాలు జారీ
- క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే 46 శాతం, ఆభా ఐడీ ప్రోగ్రామ్ 69 శాతం మేర పూర్తి
- ఖాళీల భర్తీలో పారదర్శకత పాటిస్తున్నాం
- ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే మాకు ఫిర్యాదు చేయవచ్చు
- రోగికి అందించే వైద్యాన్ని రహస్యంగా ఉంచడానికి వీల్లేదు
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు



డాక్టర్ పి.జగదీశ్వరరావు

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పనితీరును మెరుగుపరచడంపై దృష్టిసారించామని, అందుకోసం ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. సమయపాలన పాటించకపోయినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆరోగ్య కేంద్రాల పనితీరు, కేన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్, ప్రైవేటు ఆస్పత్రులపై పర్యవేక్షణ సహా పలు అంశాలను వెల్లడించారు.

వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి?

ప్రస్తుతం గ్రామీణ జిల్లాలో తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు చొప్పున వైద్యులు, 12 మంది చొప్పున సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, పట్టణంలో 66 ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో అర్బన్ ఆరోగ్య కేంద్రంలో ఒక్కో డాక్టర్‌తోపాటు మరో ఆరుగురు సిబ్బంది పనిచేయాల్సి ఉంటుంది. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు (సెలవు రోజుల్లో మినహా) రోగులకు సేవలు అందించాలి. కొన్నిచోట్ల సిబ్బంది ఉండడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. వైద్యులు తప్పనిసరిగా వారికి కేటాయించిన సమయాల్లో ఆస్పత్రుల్లోనే ఉండాలి. ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్) కఠినంగా అమలు చేస్తున్నాం. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపులు లేవు. రాష్ట్ర స్థాయి నుంచి ఎఫ్ఆర్ఎస్ అమలు విధానాన్ని పర్యవేక్షిస్తున్నారు.


వైద్యులు తప్పనిసరిగా డ్యూటీ వేళల్లో ఆరోగ్య కేంద్రాల్లో ఉండాలి. ఉదయం ఓపీ చూసిన తరువాతే ఫీల్డ్‌కు వెళ్లాలి. ఫీల్డ్‌కు వెళితే తప్పనిసరిగా మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో ఎంటర్ చేయాలి. దీన్ని పక్కాగా పాటించాలి. లేకపోతే చర్యలు తప్పవు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల వివరాలను ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో నమోదు చేస్తున్నాం.

నియామకాలపై విమర్శలు వస్తున్నాయి?

ప్రస్తుతం ఆరోగ్య శాఖలో ఎటువంటి ఖాళీలు లేవు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ఆరోగ్య శాఖ కార్యాలయం ద్వారా ఖాళీల భర్తీ ... మిగతా 6వ పేజీలో

డ్రగ్స్ విక్రయిస్తున్న కర్ణాటక వాసి అరెస్టు

- 6.5 గ్రాముల ఎండీఎంఏ పౌడర్ స్వాధీనం



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎండీఎంఏ పౌడర్

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అత్యంత ఖరీదైన ఎండీఎంఏ పౌడర్ (డ్రగ్)ను విక్రయించేందుకు యత్నిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 6.5 గ్రాముల ఎండీఎంఏ పౌడర్‌ను స్వాధీనం చేసుకుని త్రీ టౌన్ పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని రంగవల్లి విల్లగె జిల్లా కొత్తగారే ప్రాంతానికి చెందిన రంగస్వామి నంజిగౌడ (23) పదో తరగతి వరకు చదువుకున్నాడు. తండ్రి చిన్నతనంలోనే మరణించగా, తల్లి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రంగస్వామి అల్లరిచిల్లరగా తిరుగుతుంటాడు. బెంగళూరు నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్నాడు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న సాయిరాం డార్మెటరీలో బస చేశాడు. బుధవారం ఉదయం ఏయూ ఇంజనీరింగ్ మైదానం వద్ద ఉండగా, మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో రంగస్వామిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద 6.5 గ్రాముల ఎండీఎంఏ పౌడర్ లభ్యమైంది. అతడిని విచారించగా గతంలో కూడా నగరానికి వచ్చి మాదకద్రవ్యాలను విక్రయించాడని తేలింది. కేసు దర్యాప్తు కోసం రంగస్వామిని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు.

ఉక్కు చర్చలు విఫలం

- తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి తీసుకోవాలని సంఘాల నాయకుల డిమాండ్
- స్పందించని యాజమాన్య ప్రతినిధులు
- నేటి సాయంత్రంలోపు తేల్చకుంటే శుక్రవారం సమ్మె చేస్తామని నేతల హెచ్చరిక



సమావేశానికి హాజరైన కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) మొహంతి సమక్షంలో బుధవారం రాత్రి ఉక్కు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘ నాయకుల మధ్య జరిగిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, పాత పద్ధతిలో గేటు పాస్‌లు ఇవ్వాలని కార్మిక నాయకులు కోరారు. అయితే అందుకు యాజమాన్య ప్రతినిధులు సానుకూలంగా స్పందించలేదు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుంటామని గురువారం సాయంత్రంలోపు ప్రకటన చేయాలని, లేనిపక్షంలో శుక్రవారం ఒక్కరోజు సమ్మె చేస్తామని కార్మిక నాయకులు ప్రకటించారు. సంస్థ పరిస్థితులను అర్థం చేసుకొని యాజమాన్యంతో చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని ఆర్ఎల్‌సీ సూచించారు. ఈ సమావేశంలో యాజమాన్యం తరపున జీఎంలు ఎం.మధుసూదనరావు, ఎస్.భాను, డీజీఎంలు సురేంద్రకుమార్, శంకర్‌లు, కార్మికుల తరపున మంత్రి రవి, నమ్మి రమణ, వంశీకృష్ణ, సత్యారావు, ఎల్.సొంబాబు, పితాని భాస్కరరావు పాల్గొన్నారు. చర్చల అనంతరం కార్మిక నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోనిపక్షంలో శుక్రవారం ఒక్కరోజు సమ్మె చేయడంతోపాటు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.12 (గురువారం సాయంత్రం)
సహర్ : 4.38 (శుక్రవారం ఉదయం)

స్టీల్‌ప్లాంటులో 1,126 మందికి వీఆర్ఎస్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో 1,126 మంది వీఆర్ఎస్ తీసుకుంటున్నారు. ఎగ్జిక్యూటివ్‌లు 493 మంది (సీజీఎం ఒకరు, జీఎంలు 38 మంది, డీజీఎంలు 160 మంది, ఏజీఎంలు 33 మంది, సీనియర్ మేనేజర్‌లు 208 మంది, మేనేజర్‌లు 17 మంది, అసిస్టెంట్ మేనేజర్‌లు 13 మంది), నాన్ ఎగ్జిక్యూటివ్‌లు 633 మంది ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారు.

ఆర్థిక వృద్ధికి ప్రణాళికలు

... 5వ పేజీ తరువాయి

మురుగునీటి సమస్య పరిష్కారానికిగాను యూజీడీ పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. తాగునీటి సరఫరా మరింత మెరుగుపర్చేందుకు వీలుగా ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే విశాఖ జిల్లా తలసరి ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉందని, వచ్చే ఏడాదికల్లా రాష్ట్ర స్థూల అభివృద్ధిలో విశాఖ రీజియన్ వాటా 15.7 శాతం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదాయపరంగా రాష్ట్రంలో విశాఖ ప్రథమ స్థానంలో ఉన్నప్పటికీ, ప్రస్తుత ఏడాది జిల్లా వృద్ధి రేటు 9.73గా ఉందంటూ...రాష్ట్ర వృద్ధి రేటు 12.02 కంటే తక్కువగా ఉండడానికి గల కారణాలను కలెక్టర్ వివరించారు. ఈ ఏడాది నిర్మాణ రంగం మందకొడిగా ఉందని, ఇసుక, మెటల్ వంటి ముడిసరకు కొరత వచ్చిందన్నారు. రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.1,500 కోట్లుగా నిర్ధయిస్తే ఇంతవరకు రూ.1,100 కోట్లు వచ్చిందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే ఏడాది నిర్మాణ రంగంపై ఎక్కువగా ఫోకస్ పెడతామన్నారు. జిల్లా ఆదాయంలో సర్వీస్ సెక్టార్ నుంచి 50 శాతం, ఉత్పత్తి రంగం నుంచి 45 శాతం, వ్యవసాయం నుంచి ఐదు శాతం వస్తుందన్నారు. ఉత్పత్తి రంగంపై మరింత దృష్టిసారించడం వల్ల ఆదాయం పెరిగేలా కృషిచేస్తామన్నారు. రెండు పోర్టుల ద్వారా వ్యాపారం పెరిగితే ఆదాయం వృద్ధి చెందుతుందన్నారు. దీంతో వచ్చే ఏడాది వృద్ధి రేటు 15 శాతానికి చేరుకోకపోయినా రాష్ట్ర సగటు దాటుతామని పేర్కొన్నారు.

స్మార్ట్ సిటీ పనులు 90 శాతం పూర్తి

స్మార్ట్ సిటీ, ఎన్‌సీఏపీ నుంచి నిధులు విడుదల కావలసి ఉందని, రాష్ట్ర వాటాగా రూ.248.91 కోట్లు బదిలీ చేయాల్సి ఉందని సమావేశంలో కలెక్టర్ వెల్లడించారు. గతంలో మూడు వాయిదాల్లో రూ.129.25 కోట్లు విడుదల చేశారని, వాటితో చేపట్టిన పనులు 90 శాతం పూర్తయ్యాయన్నారు. 2019 నిబంధనల ప్రకారం కోస్తా నియంత్రణ మండలి పరిధిని గుర్తించడానికి ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రూపొందిస్తున్నదని చెప్పారు. మధురవాడ, భీమునిపట్నం మధ్య సీఆర్‌జెడ్-3, సీఆర్‌జెడ్-2లను రీ క్లాసిఫికేషన్ చేయాలని వినతులు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. యారాడ భూముల అభివృద్ధికి న్యాయపరమైన అడ్డంకులు వస్తున్నాయని, ఆ భూముల్లో గంగవరం పోర్టు, రక్షణ శాఖ కార్యాలయాలు ఉన్నాయని, కోర్టులో రిట్ పిటిషన్లు కూడా ఉన్నాయన్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాలను ఒక గ్రోత్ హబ్‌ను నీతి ఆయోగ్ రూపొందించిన నేపథ్యంలో పలు రంగాల అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. 2047కల్లా 2.5 ట్రిలియన్ డాలర్ల ఆదాయాన్ని రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకున్నందున...విశాఖ రీజియన్‌లో నిర్దేశించిన 715 బిలియన్ డాలర్ల లక్ష్యం చేరుకోవడానికి అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలో రంగాల వారీగా చూస్తే గ్రాస్ వాల్యూయాడెడ్ (జీవీఏ)లో వ్యవసాయ రంగం వాటా కేవలం ఐదు శాతం మాత్రమే ఉందని పేర్కొంటూ దానిని 10 శాతానికి చేరుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నగదు రూపంలో చూస్తే రూ.68 కోట్లు మాత్రమే వ్యవసాయ రంగం వాటాగా ఉన్నట్టు వెల్లడించారు. జిల్లాలో అనేక కారణాల వల్ల రెండు వేల ఎకరాల బీడు భూములు ఉన్నాయని, వచ్చే ఏడాది 200 హెక్టార్లను సాగులోకి తీసుకువస్తామన్నారు. వరి, చిరుధాన్యాల సాగులో వినూత్న సంస్కరణలు చేపట్టి కొత్త వంగడాలు ప్రవేశపెడతామన్నారు.వరిలో ఎంటీయూ 1224, ఆర్‌ఎన్‌ఆర్ 15048, చిరుధాన్యాలలో ఇంద్రావతి, వేగవతి వంటి నూతన రకాలను అందుబాటులోకి తీసుకువచ్చి ఉత్పాదకతను పెంచుతామన్నారు. సూర్యఘర్ పథకం అమలుకుగాను ప్రతి నియోజకవర్గంలో కనీసం పది వేల యూనిట్లు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టిసారించేలా ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తామని కలెక్టర్ వివరించారు.

పేదల కాలనీలో పెద్దోళ్లకు ఇళ్లు!

... 5వ పేజీ తరువాయి

చెందిన పలువురు అభ్యంతరం వ్యక్తంచేశారు. చివరకు గ్రామ సర్పంచ్ మడక అప్పలరాజు స్వయంగా పెందుర్తి తహసీల్దార్, హౌసింగ్ అధికారులను, కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. ఇదిలావుండగా లేఅవుట్‌లో అధికారికంగా 134 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా అధికార పార్టీ దన్ను ఉండడంతో 178 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని వేర్వేరు దశల్లో ఉన్నాయి. ఇప్పటివరకూ రూ.60 లక్షల వరకూ (యూనిట్ వ్యయం రూ.1.8 లక్షలు) బిల్లులు చెల్లించారు. లేఅవుట్‌లో 134 ఇళ్లు మంజూరుచేస్తే 178 ఇళ్లు ఎలా నిర్మిస్తున్నారని అధికారులు ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. గత ఏడాది ఎన్నికల తరువాత ప్రభుత్వం మారడంతో వైసీపీ అక్రమాలపై కూటమి పార్టీలకు చెందిన నేతలు, స్థానికులు, గ్రామ సర్పంచ్ తమ పోరాటాన్ని ఉధృతం చేశారు. రెండు నెలల క్రితం లబ్ధిదారుల అర్హతపై విచారణ చేయాలని ఆదేశించిన ప్రభుత్వం, ఒక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ప్రకారం గ్రామంలో 134 మంది పేర్లను ఆధార్ కార్డు నంబరుతో విచారణ చేపట్టగా 60 మంది అనర్హులు ఉన్నారని తేలింది. వీరిలో పది మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, సైనికులు ఉన్నట్టు గుర్తించారు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. అయితే ఇంతవరకూ అనర్హులపై చర్యలు తీసుకోలేదు.

అనర్హులను ప్రాసిక్యూట్ చేయాలి

మడక అప్పలరాజు, సర్పంచ్

జెర్రిపోతులపాలెం గ్రామంలో పేదల కోసం అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో 134 ఇళ్లు మంజూరుచేశారు. కానీ 178 ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. 134 మంది జాబితాలో సగానికిపైగా అనర్హులున్నారు. మొత్తం వ్యవహారంపై విచారణ చేయాలి. అనర్హులను ప్రాసిక్యూషన్ చేయాలి. వారికి ఇళ్లు మంజూరుచేసిన అధికారులకు చర్యలు తీసుకోవాలి.

అనర్హులపై చర్యలు తీసుకుంటాం

సత్తిబాబు, పీడీ,
హౌసింగ్ కార్పొరేషన్, విశాఖపట్నం

జెర్రిపోతులపాలెంలో అనర్హులకు ఇళ్ల కేటాయింపు వ్యవహారం నా దృష్టికి వచ్చింది. సమగ్రంగా విచారణ జరిపి అనర్హులుంటే వారి పేర్లు తొలగించడంతోపాటు వారి నుంచి రికవరీ చేస్తాం.

క్లౌడ్ కిచెన్స్ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. మిగిలిన వాటికి ఎటువంటి అనుమతులు లేవు. అదలావుంచితే క్లౌడ్ కిచెన్స్ నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. చిన్నపాటి రూముల్లో, అపరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో తనిఖీలు చేయాల్సిందిగా ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులను ఆదేశించారు. వారం కిందట పది క్లౌడ్ కిచెన్స్‌ను తనిఖీ చేయగా, కొన్నింటికి అనుమతులు లేవని, అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్నారని, నాసిరకం పదార్థాలతో ఆహారాన్ని తయారు చేస్తున్నారని అధికారులు గుర్తించారు. ఆయా క్లౌడ్ కిచెన్స్‌లో నమూనాలను సేకరించి పరీక్షలకు తరలించారు. రిపోర్టులు వచ్చిన తరువాత వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ జీఏబీ నందాజీ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు క్లౌడ్ కిచెన్స్ తనిఖీలు చేస్తామని వెల్లడించారు.

క్లౌడ్ కిచెన్స్ నిర్వహణ ఎలా.?

క్లౌడ్ కిచెన్స్ ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యాయి. ముఖ్యంగా మహిళలు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇంటి వద్దే చిన్నపాటి రూమ్‌లో పలురకాల ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. క్లౌడ్ కిచెన్స్‌లో అమ్మకాలన్నీ పూర్తిగా ఆన్‌లైన్ ఆర్డర్లపైనే ఆధారపడి ఉంటాయి. కానీ, కొన్నిచోట్ల నేరుగా కూడా విక్రయిస్తున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్స్ ఉండే వారి ద్వారా క్లౌడ్ కిచెన్ నిర్వాహకులు ప్రచారం చేయించుకుంటుంటారు. ఇంటి వద్ద ఉంటూనే నెలకు రూ.20 వేల నుంచి 30 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది ఇటువైపు ఆసక్తి చూపిస్తున్నారు.

ఈ అనుమతులు తప్పనిసరి

క్లౌడ్ కిచెన్ ఏర్పాటుచేయాలంటే కొన్ని రకాల అనుమతులను తీసుకోవాలి. ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారుల వద్ద ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ తీసుకోవాలి. లేదా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ట్రేడ్ లైసెన్స్ ఉండాలి. ఎవరైనా పనిచేస్తున్నట్టయితే లేబర్ లైసెన్స్, టర్నోవర్‌ను బట్టి జీఎస్టీ సర్టిఫికెట్ ఉండాలి. ఏడాదికి రూ.12 లక్షల టర్నోవర్ దాటితే ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, అంతకంటే తక్కువ ఉంటే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. లైసెన్స్ లేకుండా నిర్వహిస్తే పది లక్షల రూపాయల వరకు జరిమానాతోపాటు కేసు నమోదుచేసే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తే రెండు లక్షల వరకు జరిమానా విధించడంతో పాటు కేసు నమోదుచేస్తారు.

అవగాహన తప్పనిసరి

క్లౌడ్ కిచెన్ ఏర్పాటు చేసేవారిలో దాదాపు మహిళలే అధికంగా ఉంటున్నారు. వారికి ఎటువంటి అనుమతులు తీసుకోవాలన్న దానిపై అవగాహన ఉండడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, వార్షిక టర్నోవర్ రెండు లక్షల రూపాయల కంటే తక్కువగా ఉంటే ఏడాదికి వంద రూపాయలు పెట్టిరిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ జీఏబీ నందాజీ తెలిపారు. అదే సమయంలో కిచెన్ పరిశుభ్రమైన వాతావరణంలో ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. ఆహార పదార్థాలు నిల్వ లేకుండా చూసుకోవాలని, అప్పుడే ఎటువంటి ఇబ్బందులు ఉండవని నందాజీ పేర్కొన్నారు.

కుటుంబ సాధికార మిత్రలతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు రమణ

పద్మనాభం,మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి, పార్టీకి వారధిగా పనిచేస్తూ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చడానికి కుటుంబ సాధికార మిత్రలను నియమించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ చెప్పారు. బుధవారం జడ్పీ అతిథి గృహంలో నిర్వహించిన మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి 30 కుటుంబాలకు ఒకరిని సాధికార మిత్రగా నియమించనున్నట్టు తెలిపారు. అనంతరం మండలంలోని 22 పంచాయతీల నుంచి 14 వేల మందికి సభ్యత్వం చేయగా వారందరికీ ఐడీ కార్డులను ఆయా గ్రామాల నాయకులకు అందజేశారు. శత శాతం సభ్యత్వాలు చేసిన బుడ్డివలస గ్రామ నాయకులను సత్కరించారు.

నేటి నుంచి నూకాలమ్మ ఉత్సవాలు



అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్లో) నూకాలమ్మ



లైటింగ్‌తో ధగధగలాడుతున్న మెయిన్ రోడ్డు

భీమునిపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గురువారం నుంచి నూకాలమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈఉత్సవాలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది తరలిరానున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విశాఖ దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎన్. సుజాత పర్యవేక్షణలో సహాయ కమిషనర్ టి. అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఆలయ ఈఓ బొంగరాల మురళీమోహన్, అధికారులు ఏర్పాట్లు చేశారు. నగరంలోని పలు ఆలయాల నుంచి ఐరన్ రాడ్లు తీసుకువచ్చి క్యూ లైన్లు వేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ అల్లిపిల్లి వేణుబాబు, ప్రధాన కార్యదర్శి యెచ్చర్ల హరి, సభ్యుల పర్యవేక్షణలో అమ్మవారి ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. గురువారం రాత్రి తొలేళ్ల ఉత్సవం జరగనుంది. పలు నేలవేషాలు, బళ్ల వేషాలతో అమ్మవారి ప్రతిరూపమైన తంగేటి పూలగరగను చదురుపట్టు నుంచి తొడ్కొని వచ్చి పుర వీధుల్లో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. శుక్రవారం సాయంత్రం అనుపు ఉత్సవం జరగనుంది. శనివారం ముగింపు ఉత్సవం, ఆదివారం ఉగాది వేడుకలు జరగనున్నాయి. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నార్త్ ఏసీపీ అప్పలరాజు పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని భీమిలి సీఐ తిరుమలరావు తెలిపారు. ఆలయ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఎన్. శ్రీధర్, ఉత్సవ ఇన్‌స్పెక్టర్‌గా కీర్తి శ్రీనివాసరావు, నగరంలోని వివిధ దేవాలయాల నుంచి సుమారు 50 మంది సిబ్బందిని రప్పిస్తున్నామన్నారు.

రహదారిపై వ్యాపారం

- విజేత సూపర్‌మార్కెట్ నుంచి సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే రోడ్డులో దుస్థితి
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం





రోడ్డుపై వేసిన కుర్చీలు, టిఫిన్ చేయడానికి వచ్చిన వారు రోడ్డుపై నిలిపివేసిన వాహనాలు

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-2 పరిధి విజేత సూపర్ మార్కెట్ నుంచి సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే రోడ్డులో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి.ఒకరు ఏకంగా రోడ్డును ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడమే కాకుండా పార్కింగ్ టైల్స్‌తో దుకాణంగా మార్చేసుకున్నారు. దీనిపై పలువురు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. తాజాగా అదే రోడ్డులో మరొకరు ఏకంగా కంటెయినర్ పెట్టి టిఫిన్ దుకాణం నడుపుతున్నారు. జీవీఎంసీ అధికారులకు కొందరు దీనిపై ఫిర్యాదు చేస్తే కంటెయినర్ పెట్టిన స్థలం ప్రైవేటుది కాబట్టి తాము చర్యలు తీసుకోలేమని చేతులెత్తేశారు. అయితే టిఫిన్ దుకాణానికి వచ్చేవారికి కుర్చీలు వేసేందుకు కంటెయినర్ ముందు స్థలం లేకపోవడంతో దుకాణదారుడు ఏకంగా రోడ్డుపై కుర్చీలు వేసి వ్యాపారాలు సాగిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. టిఫిన్ చేసేందుకు వచ్చే వారంతా రోడ్డుపైనే తమ వాహనాలు పార్కింగ్ చేసి, కుర్చీల్లో కూర్చొని తింటున్నారు.దీంతో ప్రతిరోజూ ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ఒక్కోసారి టిఫిన్ చేస్తున్నవారు హఠాత్తుగా పైకి లేస్తుండడంతో పక్కనుంచి వెళ్లే వాహనదారులు ఆందోళనకు గురై ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాలాజీనగర్‌లో 'ప్రజా చైతన్య యాత్ర'



స్థానికులతో మాట్లాడుతున్న నాయకులు

తగరపువలస, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 1, 2 వార్డుల పరిధిలోని బాలాజీనగర్, యాతపేటలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలిపారు. సీపీఎం నాయకులు బుధవారం ఆయా ప్రాంతాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు కుళాయిల ద్వారా తగినంత తాగునీరు సరఫరా కావడం లేదని, ఉచిత గ్యాస్ రాయితీ నగదు తమ బ్యాంకుల అకౌంట్‌లలో జమ చేయడం లేదని చెప్పారు. అలాగే తమ ప్రాంతాల నుంచి ప్రధాన రహదారికి రోడ్డు సదుపాయం లేదని, ఇళ్లపై విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జోగునాయుడు మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మూర్తి, అప్పలనాయుడు, నరసింగరావు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరం

- కేంబ్రిడ్జి వర్సిటీ పరిశోధకుడు అభిషేక్ అగర్వాల్



అభిషేక్ అగర్వాల్‌ను సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

సాగర్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వివిధ రంగాలకు అవసరమైన నూతన విజ్ఞానాన్ని శోధించడంలో కృత్రిమ మేధ కీలక పాత్ర వహిస్తోందని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం పరిశోధకుడు అభిషేక్ అగర్వాల్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆటో మొబైల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదార్థ విజ్ఞానంపై జరిగే పరిశోధనల్లో సత్వర ఫలితాలకు సంప్రదాయ పద్ధతుల కంటే కృత్రిమ మేధ అత్యంత వేగవంతమైన సమాచారం అందిస్తాయన్నారు. వైద్య, పారిశ్రామిక, వైమానిక, ఆటోమొబైల్ రంగాల్లో నూతన పదార్థాలను వెలుగులోకి తీసుకురావడం ఎంతో అవసరమని, ఈమేరకు కృత్రిమ మేధ సహాయంతో మెటీరియల్ సైన్స్ పరిశోధకులు అధ్యయనాలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్, ఏకే ప్రసాదరావు, డాక్టర్ రాజేశ్వరరెడ్డి, బీవీఆర్ టాటా, తదితరులు పాల్గొన్నారు.

జింకపై కుక్కల దాడి

సాగర్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ సమీపంలోని తాటిచెట్లపాలెం జూప్రహరీకి ఆనుకుని వున్న ప్రాంతంలో సంచరించిన జింకపై బుధవారం సాయంత్రం కుక్కలు దాడి చేశాయి. ఈ ప్రాంతానికి నాలుగు జింకలు తరచూ వస్తుంటాయి. ఈమేరకు ఒక జింకపై కుక్కలు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాయి. వాటి నుంచి తప్పించుకున్న జింక రక్తస్రావంతో జూ ప్రహరీకి ఆనుకుని వున్న పొదల్లోకి పారిపోయి ప్రాణాలు కాపాడుకుంది.

గీతంలో అధ్యాపకులకు శిక్షణ

సాగర్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర విద్యా శాఖా మంత్రి ఆధ్వర్యంలోని ఇన్నోవేషన్ సెల్,అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) సంయుక్తంగా గీతం వర్సిటీలో ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులకు బుధవారం ఇన్నోవేషన్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌పై ప్రత్యేక ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించాయి. విద్యార్థుల్లో స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడానికి వీలుగా కళాశాలలు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో నిపుణులు అధ్యాపకులకు వివరించారు. నూతన ఆవిష్కరణలు, మేధో హక్కులు, మార్కెటింగ్ నైపుణ్యాలు, ఆర్థిక ప్రణాళిక, స్టార్టప్ ఆలోచనలు, వినియోగదారుల అవసరాలను గుర్తించడం వంటివి స్టార్టప్‌ల విజయానికి ఏవిధంగా ఉపయోగపడతాయో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు, ప్రొఫెసర్ రవిశంకర్, సుబేంద్రకుమార్ మిశ్ర, చంద్రమౌళి, ఏఐసీటీఈ ఇన్నోవేషన్ సెల్ మేనేజర్ డాక్టర్ బీఎల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి కొబ్బరికాయలతో మొక్కు చెల్లింపు

సింహాచలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలోని బంజానగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే (బీజేపీ) ప్రద్యుమ్న కుమార్ నాయక్ అభిమానులు వరాహలక్ష్మీనృసింహస్వామికి బుధవారం వెయ్యి కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు. తమ నేత ఎన్నికల్లో గెలుపొందాలని వారు స్వామివారిని కోరుకున్నారు. ఈ మేరకు వెయ్యి కొబ్బరికాయలను స్వామివారి సన్నిధిలో కొట్టి, పూజలు చేశారు.

వై బ్రెన్స్ క్లబ్ ప్రారంభం

సాగర్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల క్యాంపస్‌లో బుధవారం వైబ్రెన్స్ పేరుతో విద్యార్థి క్రీడల, సాంస్కృతిక క్లబ్‌ను ప్రారంభించారు. మెకానిక్ ఇంజనీరింగ్ విద్యార్థులు సృజనాత్మకతతో ఏర్పాటు చేసిన ఈ క్లబ్‌ను కళాశాలల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఐఎస్ పల్లవి, ఇంజనీరింగ్ టెక్నాలజీ ప్రోగ్రామ్ డైరెక్టర్ వినయ్ ప్రారంభించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పద్మనాభం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు వచ్చే నెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ చెప్పారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 14 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

వైద్యులు సమయ పాలన పాటించాలి

... 5వ పేజీ తరువాయి

జరిగేది. ఇప్పుడు డీఎంఈ, డీహెచ్ ఆధ్వర్యంలో జరుగుతోంది. కొన్ని పోస్టులు మేము భర్తీ చేస్తున్నాం. అటువంటి వాటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిబంధనలకు అనుగుణంగా పోస్టులను భర్తీ చేస్తున్నాం. మెరిట్ ఉన్న వారికి మాత్రమే ఉద్యోగాలు వస్తాయి.

కేన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఎంతవరకు వచ్చింది?

ప్రభుత్వం కేన్సర్ రోగులను ముందు గానే గుర్తించేందుకు స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ను నిర్వహిస్తోంది. ఇప్పటివరకూ జిల్లాలో 46 శాతం పూర్తయింది.ఈ సర్వేలో భాగంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్లను ముందుగా గుర్తించడంతో పాటు బీపీ,షుగర్ వంటి వాటిని నిర్ధారి స్తున్నాం. అనుమానిత కేన్సర్ కేసులను కేజీహెచ్‌లోని ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌కు తరలించి పరీక్షలు చేయిస్తున్నాం. వచ్చే నెలాఖరు నాటికి సర్వే పూర్తి చేయ డమే లక్ష్యంగా పెట్టుకున్నాం. అర్బన్ ప్రాంతాల్లో ప్రజలు సర్వేకు సహకరిం చాలి. అలాగే, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా) ఐడీ ప్రోగ్రామ్ కూడా నడుస్తోంది. ఆధార్ తరహాలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య ఐడీ ఇచ్చేందుకు ప్రభు త్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఏఎన్ఎం ఇంటింటికీ వెళ్లి ఆధార్‌తో అటాచ్ అయి ఉన్న ఫోన్ నంబర్‌ను ఎంటర్ చేసి అభా ఐడీని జనరేట్ చేస్తు న్నారు. భవిష్యత్తులో ఆధార్ తరహాలో వైద్య సేవల కోసం ఈ ఐడీ ఉపయో గపడుతుంది. రోగులు ఆస్పత్రులకు వెళ్లినప్పుడు ఆ నంబర్ చెబితే వారి ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. ఇది మెరుగైన సేవలు అందించేందుకు ఉపకరిస్తుంది.

మీరు ప్రాధాన్యం ఇచ్చే అంశాలు?

ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యం. తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టిసారిస్తున్నా. ఓపీ, ఐపీ సేవలు, డెలివరీలు పెంచాలి. ఫ్యామిలీ ప్లానింగ్ అంటే బిడ్డకు బిడ్డకు మధ్య దూరం పట్ల ప్రజల్లో అవగాహన కలిగించాలి. ఆయా కేంద్రాలకు వెళ్లిన ప్పుడు తప్పనిసరిగా ఈ అంశాలను అడిగి తెలుసుకుంటున్నా. వైద్యులు, సిబ్బంది చెప్పే మాటలు విని వచ్చే యకుండా రోగులతో కూడా మాట్లాడి సేవలు అందుతున్న తీరును తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం. ప్రతిరోజూ నాలుగు నుంచి ఐదు ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం.

ఆస్పత్రులపై పర్యవేక్షణ ? కొరవడినట్టుంది?

జిల్లాలోని ఆస్పత్రులతోపాటు క్లినిక్‌లు, ల్యాబొరేటరీలను నిరంతరం పర్యవేక్షిస్తు న్నాం. ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే వాటిపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో అధికంగా డబ్బులు వసూ లు చేస్తున్నారని రోగుల బంధువులు ఆందోళనలు చేస్తున్నారు. ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. అటువంటి వాటిపై అధికారులతో విచారణ చేయిస్తున్నాం. మా సిబ్బంది ఎప్పటికప్పుడు కొన్ని ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటుంటారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే మాకు ఫిర్యాదులు చేయవచ్చు. రోగికి అందించే వైద్యాన్ని రహస్యంగా ఉంచడానికి వీల్లేదు. కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాలి.

ఆలయ భద్రతపై నిర్లక్ష్యం

సింహాచలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ భద్రతపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పలుమార్లు ఎస్‌పీఎఫ్, ఆక్టోపస్ వంటి రక్షణ సంస్థల అధికారులు ఆలయ భద్రతను పెంచాల్సిన అవసరం ఉందని దేవస్థానం అధికారులను లిఖిత పూర్వకంగా హెచ్చరించారు. ముఖ్యంగా ఆలయ ప్రవేశ మార్గాల్లో భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. కానీ అధికారులు అవేవీ చేయకపోగా ప్రవేశ మార్గాల్లో భక్తుల తనిఖీ కూడా నామమాత్రంగా చేపడుతున్నారు. ఇటీవల కొందరు తమ వెంట ఆలయం లోపలికి బ్యాగులను తీసుకురావడం యథేచ్ఛగా జరుగుతోంది. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

'విద్యాభివృద్ధికి మంత్రి లోకేశ్ కృషి'

భీమునిపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యాభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ విశేష కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. గురువారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు జార్జియా నేషనల్ యూనివర్సిటీ (జీఎన్‌యూ)తో మంత్రి లోకేశ్ ఒప్పందం చేసుకోవడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. సుమారు రూ.1300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ వర్సిటీ వల్ల 500 మందికి పైగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. జీఎన్‌యూ రాకతో రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు.

లక్ష్మీపురంలో విద్యార్థుల ర్యాలీ

భీమునిపట్నం (రూరల్), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు బుధవారం ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉన్న తమ పాఠశాలలో గ్రామానికి చెందిన బడిఈడు పిల్లలను చేర్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి. బంగారునాయుడు, ఎంఈఓ పి. శివరాణి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ

మధురవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని టీడీపీ కార్యకర్తలకు వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ బుధవారం సభ్యత్వ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వార్డు పరిధిలో అత్యధికంగా సభ్యత్వాల నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, వార్డు అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు, వార్డు కార్యదర్శి కానూరి అచ్యుతరావు, యూనిట్ ఇన్‌చార్జి నాగోతి సూర్యప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన

ఆనందపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుసులువాడలో భూముల రీ సర్వేపై రెవెన్యూ అధికారులు రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రీ సర్వే వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. రీ సర్వే జరిగే సమయంలో రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలతో అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్యామ్ ప్రసాద్, డివిజనల్ సర్వే అధికారి కొండలరావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గోవింద్, మండల సర్వేయర్ అప్పన్న, పాల్గొన్నారు.

30న పంచాంగ శ్రవణం

సాగర్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ లో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వా మి ఆలయంలో ఈనెల 30న ఉగాది పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోజు వేకువ జామున 4 నుంచి 4.30 నిమిషాల వరకు స్వామివారికి సుప్రభాత సేవ, 4.30 నుంచి 6 వరకు అర్చనలు, తోమల, సహస్ర నామార్చన, 6 నుంచి 8.30 వరకు భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. 9 నుంచి 10 వరకు పంచాంగ శ్రవణం, అనంతరం రాత్రి 7 వరకు భక్త లకు దర్శనలు ఉంటాయన్నారు.

విద్యా ప్రదాత ఆనందగజపతిరాజు : ఈఓ



సింహాచలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పూర్వపు అనువంశిక పాలక మండలి చైర్మన్ దివంగత పూసపాటి ఆనందగజపతిరాజు మహా దాత, విద్యా ప్రదాత అని ఈఓ కె.సుబ్బారావు అన్నారు. బుధవారం ఆనందగజపతిరాజు పదో వర్ధంతి పురస్కరించుకుని దేవస్థానం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఈఓ పూలమాల వేసి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజరికపు వ్యవస్థలో పుట్టి సామ్యవాదిగా ఎందరో సామాన్యులకు విద్య అందించాలన్న లక్ష్యంతో విద్యా సంస్థలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ డిజి శ్రీనివాసరాజు, పర్యవేక్షణాధికారి సునీల్‌కుమార్, వేద పండితులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిరంజీవిరావు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

గాజువాక, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉత్తరాంధ్ర గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. గాజువాక స్టీల్ సిటీ ఐటీఐలో టాటా స్ట్రీవ్ వీఈటీ ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఇన్నోవేషన్ చాలెంజ్ కాంపిటేషన్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక శిక్షణ విద్యార్థులకు చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగుతూ ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎలక్ట్రికల్ వింగ్‌లో పంప్ ఆటోమేషన్ విత్ టీవోటీ ప్రాజెక్టుకు గాను గాజువాక ఐటీఐ ప్రథమ స్థానంలో, ఏఐ అలెక్స్ పీపీఈ ప్రాజెక్టుకు ద్వితీయ స్థానంలోనూ నిలిచింది. మెకానికల్ వింగ్‌లో ఈ-గోల్ ప్రాజెక్టుకు గాను విజయనగరం ఐటీఐ ప్రథమ, లైట్ హౌస్ ప్రాజెక్టుకు కంచరపాలెం ఐటీఐ ద్వితీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో ఐటీఐ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వీ రమణ, గాజువాక ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాస్, ఐఎంసీ చైర్మన్ బాలాజీ, కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఇతర వ్యక్తిత్వ వికాస అంశాలలో కూడా ప్రతిభ చూపాలని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు సరిఫికెట్లు, బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ట్రైనర్ అమ్మాజీ, మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక కారు డ్రైవర్ ఆత్మహత్య


మృతుడు వెంకట పవన్‌కుమార్ (ఫైల్ ఫొటో)

గాజువాక, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ కారు డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం గాజువాక వాంబే కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాంబే కాలనీకి చెందిన డి.వెంకట పవన్‌కుమార్ (28) తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. తాను చేసిన అప్పులను తీర్చే పరిస్థితి లేకపోవడంతో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తల్లికి వాట్సాప్ ద్వారా వాయిస్ మెసేజ్ పెట్టి ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమకు అందిన సమాచారం మేరకు గాజువాక పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **డ్రాగన్ :** కామేశ్వరి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 16, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 27, బెండకాయలు 28, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 10, క్యారెట్ 32 దొండకాయలు 28, బంగాళదుంపలు 15, అరటికాయ (పె) 8, అల్లం (పాతది) 50, బరబాటి 25, ముల్లంగి 24, మునక్కాడలు (కిలో) 28, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 20, క్యాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కంద 64, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	410
విజయనగరం	414
శ్రీకాకుళం	414

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	88
లైవ్ ధర	108
విత్ స్కిన్	186
స్కిన్‌లెస్	196

శ్మశానవాటికలో దొంగలు పడ్డారు..

మిందిలో రెండు బర్నింగ్ యూనిట్ల ఫ్రేమ్‌లను ఎత్తుకుపోయిన చోరులు


మింది శ్మశానవాటికలో ఫ్రేమ్‌లు లేని రెండు బర్నింగ్ యూనిట్లు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మింది శ్మశానవాటికలో దొంగలు పడ్డారు. మృతదేహాల దహనానికి వినియోగించే బర్నింగ్ యూనిట్‌కు ఉండే ఐరన్ ఫ్రేమ్‌లను ఎత్తుకుపోయారు. ఇటీవలే సుమారు రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన శ్మశానవాటికలో రెండు బర్నింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. మింది కాలనీలో బుధవారం ఒక వ్యక్తి మృతి చెందడంతో దహన సంస్కరణలను చేసేందుకు స్థానికులు మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువచ్చారు. అయితే రెండు బర్నింగ్ యూనిట్లకు ఉండే ఐరన్ ఫ్రేమ్‌లతో పాటు రాడ్లు లేకపోవడం చూసి అందరూ కంగుతిన్నారు. సుమారు రూ.రెండు లక్షల విలువ చేసే ఈ ఐరన్ ఫ్రేమ్‌లు, రాడ్లు చోరీకి గురైనట్టు కాలనీ నాయకులు ఈటి వెంకటరావు, ఓ. వెంకటరావు, ఈటి శ్రీరాములు, తదితరులు కార్పొరేటర్ గుడివాడ అనూషకు తెలియజేయడంతో పాటు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్మశానవాటికలో సైతం చోరీలకు పాల్పడుతుండడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

అర్ధంతరంగా నిలిచిన కాలువల నిర్మాణ పనులు

తీవ్ర ఇబ్బందులకు గురువుతున్న ఎల్‌వీ నగర్ వాసులు



ఎల్‌వి నగర్‌లో శిథిలమైన కాలువల నిర్మాణం కోసం తవ్వకాలు జరిపి వదిలివేసిన దృశ్యం

ఆటోనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి ఎల్‌వీ నగర్‌లో డ్రైనేజీల మరమ్మతు పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎల్‌వీ నగర్‌లో రోడ్లు గోతులమయంగా మారడం, కాలువలు మరమ్మతులకు గురవ్వడంతో ప్రజలు నానాపాట్లు పడుతున్నా వైసీపీ హయాంలో పట్టించుకునే నాథులే కరువయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ముందుగా డ్రైనేజీల నిర్మాణాల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో తవ్వకాలను కూడా చేపట్టారు. అయితే డ్రైనేజీల నిర్మాణానికి అడ్డుగా ఉన్న కొన్ని భవంతుల ప్రహరీలను తొలగించాల్సి ఉండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలు తరబడి పనులు నిలిపివేసినా అధికారులు గానీ ప్రజాప్రతినిధులు కానీ స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తుంది. భవన యజమానుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా కాలువల నిర్మాణ పనులతో రహదారులను కూడా అభివృద్ధి చేయాలని ఎల్‌వీ నగర్ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విజ్ఞాన్‌లో ముగిసిన హ్యాకథాన్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల, వుమెన్ టెక్ మేకర్స్ వైజాగ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కాలేజీలో నిర్వహించిన హ్యాకథాన్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 60 జట్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చూపాయి. విజేతలకు ప్రిన్సిపాల్ జె.సుధాకర్ నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు పరిశ్రమల్లో ఉత్తమ ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఉందన్నారు. అలాగే కెరీర్ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, హెచ్‌వోడీలు దినేశ్‌రెడ్డి, స్వాతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విజ్ఞాన్ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

ఇటీవల భీమవరంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి ఫార్మా క్విజ్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు అల్లు పుష్ప, మాణిక్యం సాయి శ్రీవాణిలు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు వారిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కో- ఆర్డినేటర్ కమలకుమారి, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ నిర్ణయం చరిత్రాత్మకం'

పెదగంట్యాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ నిర్ణయం చరిత్రాత్మకమైనదని మాదిగ దండోరా జిల్లా నాయకుడు, టీడీపీ 75వ వార్డు సమన్వయకర్త ములకలపల్లి పెంటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాతికేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సీఎం చంద్రబాబు పరిష్కరించే దిశగా అడుగులు వేశారన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును మంత్రి మండలిలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్గీకరణ వల్ల ఎస్సీ కులాలన్నింటికీ సమ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

క్యూబా ప్రజల సహాయార్థం విరాళాల సేకరణ

అక్కిరెడ్డిపాలెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి) క్యూబా దేశ ప్రజల సహాయార్థం బెల్ హెచ్‌పీవీపీ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు కర్మాగారం మెయిన్ గేటు వద్ద విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ మాట్లాడుతు ప్రజా సంస్కరణలతో ఎన్నో దేశాలకు ఆదర్శంగా నిలచిన సోషలిస్టు దేశం క్యూబా ఇప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవడం బాధాకరమని, ఆ దేశీయులను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. నాయకులు జగన్నాథరావు, విజయ్‌కుమార్, నారపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన శిబిరంలో హిందూజా నిర్వాసితులు

దుమ్ము, ధూళి నుంచి కాపాడాలని ఆందోళన

గాజువాక, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యాష్ పాండ్‌ను తరలిస్తున్న లారీల నుంచి వెలువెడుతున్న దుమ్ము, ధూళి నుంచి తమకు కాపాడాలని డిమాండ్ చేస్తూ హిందూజా నిర్వాసితులు బుధవారం సంస్థ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ యాష్ పాండ్‌ను తరలిస్తున్న లారీలు పరిమితికి మించి అధిక లోడ్‌తో వెళుతున్నాయన్నారు. ఈ మార్గంలోని రోడ్డును నిత్యం నీటితో తడపాల్సి ఉన్నప్పటికీ అటువంటి చర్యలేమీ చేపట్టకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల లారీలు వెళ్లే న సమయంలో పెద్దఎత్తున దుమ్ము, ధూళి వ్యాపిస్తుందన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతుందని వాపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పాల అచ్చిల్‌నాయుడు, నగేశ్, పైడిరాజు, పైడిరెడ్డి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి సిద్ధార్థనగర్ వద్ద గల 12 ఎంఎల్‌డీ తాగునీటి శుద్ధి కర్మాగారంలో వాల్వ్‌ల మార్పు, మరమ్మతు పనులు చేపడుతున్నందున గురువారం 86, 87 వార్డులకు నీటి సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందని వాటర్ వర్క్స్ ఏఈ కేదారినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

ఇంటక్ కార్మిక నాయకులకు సత్కారం



స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులను సత్కరించిన ఇంటక్ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులోని వివిధ విభాగాల్లో ఇంటక్‌కు నాయకత్వం వహిస్తూ వీఆర్ఎస్ తీసుకున్న పలువురు కార్మిక నాయకులను బుధవారం యూనియన్ నేతలు సత్కరించారు. ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికుడి నుంచి యూనియన్ అగ్ర నాయకులుగా ఉద్యోగులు ఎదిగారని, కార్మిక సమస్యలపై పోరాటాలు సాగించారన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రాజు, నాయకులు కారు రమణ, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యాలకు ప్రతీక ఇఫ్తార్ విందు

అగనంపూడి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యాలకు ప్రతీకగా ఇఫ్తార్ విందు నిలుస్తుందని అగనంపూడి మసీద్ ఈ అబూబకర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్‌మీరా మొహిద్దీన్ బాషా అన్నారు. ఇక్కడి మసీదులో బుధవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాలకు అతీతంగా రంజాన్ పండగను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గంతకోరు అప్పా రావు, బి.సత్యనారాయణ, గోడు గురుమూర్తి, మోసెస్ రాజు, మౌలాలి, షేక్ అబ్దుల్లా రహీమ్, పల్లీబాయ్, హుస్సేన్, మహమ్మద్ రబీ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

మల్కాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 61వ వార్డు మల్కాపురంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని గ్రామ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే గణబాబును కోరారు. బుధవారం వారు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి, వినతిపత్రం అందజేశారు. గ్రామ సదను పట్టు స్థలంలో రూఫ్‌టాప్ నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు భోగవిల్లి నాగభూషణం, అధ్యక్షుడు సత్యాల మహేష్, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముప్పిడి వెంకట గిరి, కోశాధికారి పట్నాల పెంటరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

పెందుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెందుర్తిలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ట్రస్ట్ వ్యవస్థాపక, అధ్యక్షుడు దాడి శ్రీను తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ రోడ్‌లో సాయిరాం మెడికల్స్ స్టోర్స్ సమీపంలో ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో ఈ శిబిరం జరుగుతుందని, యువత సహకరించాలని కోరారు.

ఓటీ చెల్లించాలని నిరసన

ఎన్ఏడీ జంక్షన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఏడీ కార్మికులపై పెట్టిన పోలీస్ కేసులను వెంటనే ఎత్తివేయాలని, ఉద్యోగులకు పని చేసిన ఓటీకి డబ్బులు చెల్లించాలని కోరుతూ ఎన్ఏడీ గేటు వద్ద ఎన్ఏడీసీఈ యూనియన్ కార్మికులు బుధవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తుల శ్రీనివాస్, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీసీఎస్ పరీక్ష

పెందుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో బుధవారం నిర్వహించిన టాటా కన్సల్టెన్సీ (టీసీఎస్) కంప్యూటర్ ఆధారిత పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగిన ఈ పరీక్షకు 1200 మంది అభ్యర్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

కిలోన్నర గంజాయి పట్టివేత

పెందుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఒడిశా నుంచి నగరంలోకి గంజాయి తీసుకువస్తున్న వ్యక్తిని పెందుర్తి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు మేరకు... మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కౌలూరి శ్యామ్ కుమార్ (24) ఒడిశా నుంచి గంజాయి తీసుకువస్తున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు పెందుర్తి వద్ద వాహనాల తనిఖీ చేపట్టి, అతని వద్ద నుంచి ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

మూడు కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం

- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 11 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. 5 లక్షల నగదు రికవరీ


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి

పెందుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి పోలీసుస్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన చోరీ కేసులకు సంబంధించి పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి సుమారు 11 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్ ఏసీపీ డి. లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. గత నెల 14న పెందుర్తిలోని ఓ జ్యూవెలరీ షాపులో ఆభరణాలు కొనుగోలుకు వచ్చిన దంపతులు బంగారు ఉంగరాలు చూపించమని అడిగారు. యజమాని రకరకాల మోడల్స్ చూపించగా, ట్రేలో ఉంచిన ఉంగారాల్లో 5 గ్రామాల ఉంగరం చోరీ అక్కడి నుంచి పరారయ్యారు. యజమాని డెక్క రమణ పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రైం పోలీసులు విచారణ జరిపారు. ఈమేరకు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం మండలం రైస్‌పేట గ్రామానికి చెందిన దంపతులు కొప్పూరి మాణిక్యేశ్వరి(25), పిన్నింటి గణేశ్ (27) చోరీకి పాల్పడ్డారని నిర్ధారించి, వారిని అరెస్టు చేసి, 12 గ్రాముల విలువైన ఐదు బంగారు ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు నెలల్లో వారిపై పెందుర్తి, ఎలమంచిలి, గోపాలపట్నం, కంచరపాలెం, గాజువాక, భీమునిపట్నం, పీఎంపాలెం స్టేషన్ల పరిధిలో పలు కేసులు నమోదైనట్టు ఏసీపీ తెలిపారు. అలాగే గత నెల 17న నాయుడుతోట సమీపంలోని సాయిమాధవ్‌నగర్‌కు చెందిన ఇంట్లో వివాహిత బండారు శ్రావణి ముఖంపై పెప్పర్ జల్లి పిడిగుద్దులుతో కొట్టి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు తాడు చోరీ చేసిన వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు సాయిమాధవ్‌నగర్‌కు చెంది బంజారి అంబేడ్కర్ (20) అని ఎస్ఐ చెప్పారు. అతని నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. మరో కేసుకు సంబంధించి పినగాడిలో ఉంటున్న షేక్ హసీనా (50)నుంచి 8 తులాల బంగారం,30 తులాల వెండి, రూ. 5 లక్షలు నగదు రికవరీ చేశారు. అప్పుల బాధ నుంచి తప్పించుకునేందుకు ఇంట్లో భారీ చోరీ జరిగిందని అబద్ధపు ఫిర్యాదు చేశానని బాధిత మహిళ పోలీసులకు తెలిపింది. దీంతో దొంగలు చోరీ చెప్పినట్టు బంగారం, వెండి, నగదును ఆమె పోలీసులకు అప్పగించింది. కేసులను ఛేదించి నిందితులను అరెస్టు చేసిన క్రైమ్ ఎస్ఐ సూరిబాబు, ఏఎస్ఐ మూర్తి, హెచ్‌సీ నాగరాజు , పీసీలు కిశోర్, పైడిరాజు, శివ ప్రసాద్, దేవుడునాయుడు, నితీశ్ కుమార్, హైమావతిని ఉన్నతాధికారులు అభినందించారు.

నేడు మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నిక

పెందుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పదవికి గురువా రం పరోక్ష పద్ధతిలో ఎన్నిక నిర్వహించనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిషత్‌లో తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వైసీపీ ఎనిమిది, టీడీపీ ఒక స్థానం గెలిచాయి. మెజారిటీ సభ్యుల ఆమోదంతో కో ఆప్షన్ సభ్యుడిగా వైసీపీకి చెందిన నక్క కనక రాజు ఎన్నికయ్యారు. ఏడాది కిందట కనకరాజు మృతి చెందడంతో ఆ పదవి ఖాళీ అయ్యింది. ఇటీవల మారిన రాజకీయ పరిణామాలతో వైసీపీకి చెందిన నలుగురు ఎంపీటీసీ సభ్యులు టీడీపీ, జనసేన, బీజేపీలోకి చేరుతారన్న ప్రచారం జరుగుతోంది. ఎంపీటీసీలు పార్టీల్లో చేరినా.. దీన్ని అనాధికారంగా పరిగణించనున్నామని, పరిషత్ ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి గెలుపొందారో ఆ పార్టీకి చెందిన వారిగానే గుర్తుస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక రసవత్తంగా మారనున్నది.

ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి శేష శైలజ మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహణపై అధికారులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నిక సజావుగా జరిగేందుకు అవరమైన చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికతో పాటు చింతగట్ల ఉప సర్పంచ్ పదవికి కూడా ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటరావు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఈవో ఆర్డీ అప్పలరాజు, పాల్గొన్నారు.

రంజాన్ పండుగ తేదీపై ఇంకా స్పష్టత రాలేదు

జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగ ఏ రోజు అనే విషయమై ఇప్పటి వరకూ స్పష్టత రాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. రంజాన్ పండుగ ఈ నెల 31న జరిగితే పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష ఏప్రిల్ ఒకటిన ఉంటుందని, ఒకవేళ రంజాన్ పండుగ ఏప్రిల్ 1న నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటిస్తే హాల్ టిక్కెట్లలో ప్రకటించిన విధంగా మార్చి 31న యథావిధిగా పరీక్ష ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అన్ని పాఠశాలల యాజమాన్యాలు, కరస్పాం డెంట్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తలిదండ్రులు గ్రహించాలని ఆయన కోరారు.


ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న గణబాబు

ప్రవక్త బోధనలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇస్లాం శాంతిని బోధిస్తుందని, మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుకరణీయమని ఎమ్మెల్యే పి. గణబాబు అన్నారు. 92వ వార్డు నందమూరినగర్‌లోని ఉమర్ సుల్తాన్ మసీదు కమిటీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేసే ముస్లింలతో ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, కాలనీ ముస్లింలు పాల్గొన్నారు.

హనుమాన్‌నగర్‌లో 'ప్రజా చైతన్య యాత్ర'

మల్కాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 59వ వార్డు హనుమాన్‌నగర్‌లో సీపీఎం నాయకులు బుధవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, మెట్లు, నిర్మించారు కానీ డ్రైనేజీలు నిర్మించలేదని, దీనివల్ల మురుగు నీరు రోడ్డు మీదే ఉంటుందని ప్రజలు చెప్పారు. వర్షం పడితే మురుగు ఇళ్లల్లోకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మణమూర్తి, కె. రమణ, ప్రశాంత్, రామకృష్ణ, ఈశ్వరరావు, దుర్గారావు, ఎం. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ముగిసిన శిక్షణ


శిక్షణలో పాల్గొన్న కార్యకర్తలు

గోపాలపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణా బీ - పఢాయి బీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీవో కుమారి, డీపీవో శ్రీలత, కార్యకర్తలకు పలు సూచనలిచ్చారు. కేంద్రానికి వచ్చే చిన్నారులకు విద్యాభ్యాసంతో పాటు పరిపూర్ణ పోషణతో కూడిన ఆహారం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, కుమారి, సింహాచలం, మర్రిపాలెం సెక్టార్ల కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

మల్కాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : భూమిపై ఉన్న ప్రతి జీవిని కాపాడాల్సిన బాధ్యత మానవాళిదేనని కేంద్ర పరిశ్రమల రక్షణ విభాగం (సీఐఎస్ఎఫ్) డిప్యూటీ కమాండెట్ ప్రిషాబ్ దేవాంగన్ అన్నారు. బుధవారం ఉదయం మల్కాపురం సీఐఎస్ఎఫ్ కార్యాలయం ఆవరణలో గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్‌జీవో నేతృత్వంలో పర్యావరణ పరిరక్షణ, పక్షుల, వన్యప్రాణుల రక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జీవిని కాపాడుకుంటేనే పర్యావరణానికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించినట్టు అవుతుందన్నారు. పక్షులు, వన్య ప్రాణుల కోసం నీరు, ఆహారం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అధికారి సందీప్, సయ్యద్, సంరక్షిత సంస్థ అధ్యక్షురాలు షీలా జైన్, గ్రీన్ క్లైమేట్ టీఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, మురళీ పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ ప్రకటనకు విశేష స్పందన


పన్ను చెల్లింపునకు బారులు తీరిన ప్రజలు

జ్ఞానాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తి, ఖాళీస్థలాలపై విధించిన పన్నుపై వడ్డీలో 50శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో పన్ను చెల్లింపుదారులు జ్ఞానాపురంలోని చెల్లింపు కేంద్రం వద్ద బుధవారం క్యూ కట్టారు. వారికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేశారు. జోన్-5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆదేశంతో తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ నెల 31లోగా పన్ను చెల్లించే వారందరికీ వడ్డీలో 50 శాతం మాఫీ చేస్తుందని, బకాయిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జడ్సీ కోరారు. చెల్లింపుదారుల కోసం జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కేంద్రం ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పనిచేస్తుందని అన్నారు.

ఎర్నిమాంబ ఆలయంలో కానుకల లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న సేవకులు

జ్ఞానాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో హుండీలో భక్తులు వేసిన కానుకలను బుధవారం లెక్కించారు. గత నెల 19 నుంచి బుధవారం వరకు 37 రోజులకు రూ.14,12,593 ఆదాయం వచ్చింది. అలాగే 173.100 గ్రాముల బంగారం, 11 కిలోల 100 గ్రాముల వెండి వచ్చింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఈవో పి.శేఖర్ బాబు, డీజే ప్రభ పర్యవేక్షణలో శ్రీహరి సేవాసంఘం, గోపాలపట్నం ఆలయ ధర్మకర్తలు, పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ

అక్కయ్యపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణంతో పాటు జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల నిరుద్యోగ యువతకు మేలు జరుగుతుందని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ అన్నారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదినం సందర్భంగా ఎన్జీజీఓస్ కాలనీలో నర్సింగ్ విద్యార్థులకు బుధవారం పుస్తకాలు, ప్యాడ్స్ పంపిణీ చేశారు. జగన్ ప్రభుత్వంలో ఉద్యోగాల కోసం ప్రశ్నించిన నిరుద్యోగులపై కేసులు బనాయించినప్పుడు అచ్చెన్నాయుడు తమకు అండగా ఉన్నారని గుర్తుచేశారు. సకాలంలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి, ఉద్యోగ వయోపరిమితి పెంచాలని కోరారు.

చిత్రలేఖన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

సీతమ్మధార, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఓటీ-చెన్నై) ఇంటర్నేషనల్ సిపోసిజం అడ్వాన్స్‌మెంట్ ఇన్ మెరైన్ రెన్యుబుల్ ఎనర్జీ' వేడుక సందర్భంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థిని సీహెచ్ భావజ్ఞా ప్రథమ స్థానాన్ని, 9వ తరగతి విద్యార్థిని ఐవీఆర్ లాస్య ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరు స్థిరమైన విద్యుదుత్పత్తి కోసం సముద్ర వనరులు అనగా గాలి, అలల ప్రవాహం, ఉష్ణోగ్రతతోపాటు ఐనిస్టీన్ సిద్ధాంతాన్ని ఎలా ఉపయోగించాలో బొమ్మ (చిత్రలేఖనం) ద్వారా తెలియజేశారు. ఈ పోటీల్లో వీరు జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. చెన్నైలో ఎన్సీసీఆర్జీ అండ్ డైరెక్టర్, శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ రమణమూర్తి నుంచి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు ఈ విద్యార్థినులను అభినందించిన శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ తెలియజేశారు.


జ్ఞాపికలతో భావజ్ఞా, లాస్య

కొళాయి కనెక్షన్ల కోసం స్థానికుల ఆందోళన


కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

సీతమ్మధార, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 14వ వార్డు కొండవాలు ప్రాంతం ఆర్.కె.నగర్ నివాసితులకు మంచినీటి కొళాయి కనెక్షన్ ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. సీతమ్మధారలోని మంచినీటి సరఫరా కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు వీరికి సంఘీభావం తెలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే మంచినీటి కొళాయి కనెక్షన్లు మంజూరు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆ శాఖ ఏఈతో ఫోనులో మాట్లాడగా రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. జిల్లా నాయకులు యూఎస్ఎన్ రాజు, జి.అప్పలరాజు, రమణ, కాలనీ నివాసితులు పాల్గొన్నారు.

ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్ల ముమ్మర సాధన


బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసి వెళ్తున్న అభిషేక్ పూరల్, సాధనలో ఢిల్లీ క్రీడాకారులు


మిచెల్ స్టార్క్ సమాలోచనలు

విశాఖపట్నం, స్పోర్ట్స్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హోం గ్రౌండ్‌లో జరిగిన తొలిమ్యాచ్‌లో విజయం సాధించిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్ల ఈనెల 30న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న మ్యాచ్ కు సమాయత్తమవుతున్నారు. రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించడమే ధ్యేయంగా ముమ్మర సాధనచేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో కెప్టెన్ అక్షర పటేల్, అశుతోష్ శర్మ, మిచెల్‌స్టార్క్, డుప్లెసిస్, సమీర్ రజ్వి, విపరాజ్ నిగమ్, పూరన్, కరుణ్ నాయర్, కులదీప్ యాదవ్, ముకేష్‌కుమార్, త్రిపూర్ణ విజయ్, మోహిత్ శర్మ, మెక్‌గుర్క్, అభిషేక్ పోరెల్, జాక్ ఫ్రాసెర్, హ్యారీ బ్రూక్, దర్శన్ నల్కాండే, అజయ్ మండల్, మన్వంత్‌కుమార్, మహదేవ్‌తివారీ, నటరాజన్, దుష్మంత చమీరా ప్రాక్టీసులో పాల్గొన్నారు.

మహిళల బ్యాడ్మింటన్ టోర్నీకి ఏయూ జట్టు


ఎంపికైన జట్టు సభ్యులతో క్రీడాధికారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే ఏయూ జట్టును బుధవారం ప్రకటించారు. ఈ నెల 29 నుంచి అలగప్పా యూనివర్సిటీలో జరిగే టోర్నీలో ఆర్.కావ్యశ్రీ, ఎం.రాధాస్రవంతి, ఆర్.కల్యాణి, వై.హిమబిందు, జి.స్వాతి, వి.నాగమాధవి, జె.హైమావతి, పి.స్రవంతి, జి.స్నేహ, పి.కీర్తన ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ జట్టుకు కోచ్‌గా బి.జ్యోతిక, మేనేజర్‌గా వెంకటేశ్వరరావు వ్యవహరిస్తారు. ఏయూ స్పోర్ట్స్ కార్యదర్శి ఎన్.విజయ్‌మోహన్ బుధవారం తన చాంబర్‌లో క్రీడాకారిణులను అభినందించి పతకం సాధించాలని ఆకాంక్షించారు. వ్యాయామవిద్య క్రీడాశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి పాల్గొన్నారు.

'పది మూల్యాంకనానికి సహకరిస్తాం'


డీఈవో ప్రేమ్‌కుమార్‌కు మొక్క అందిస్తున్న ఆపస్ సభ్యులు

అక్కయ్యపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కార్యవర్గం బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసింది. పదో తరగతి మూల్యాంకనానికి ఆపస్ పూర్తి సహకారం అందిస్తుందని కార్యవర్గసభ్యులు చెప్పారు. డీఈవోను కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్వీ విశ్వనాథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకట సత్యనారాయణ, జాతీయ పర్యటన కార్యదర్శి శ్రవణ్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు చిన్ని చిరంజీవి, ఎం.పి. శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్, మహిళా కార్యదర్శి ఎ.రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

సంకీర్తనా సారథి అన్నమాచార్యులు

డాబాగార్డెన్స్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వరస్వామిని సంకీర్తనలతో అర్చించి అన్నమయ్య సంకీర్తనా సారథిగా నిలిచారని విశ్లేషకులు చాగంటి సోమసుందర్ అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో అన్నమాచార్య వర్ధంతి, గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా అన్నమాచార్యుని చిత్రపటానికి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకొండి వెంకటరావు పూలమాల వేసి జ్యోతిని వెలిగించి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ ద్వారా అన్నమాచార్య సంకీర్తనల వైభవానికి సేవలందించిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంగీత సేవలు సదా స్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పి.జగన్‌మోహన్‌రావు, కోశాధికారి జి.మధుబాబు, సంయుక్త కార్యదర్శి వి.మధుసూదనరావు, సహాయ కోశాధికారి ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు. తదుపరి సంస్థ శిష్యులు అన్నమాచార్య సంకీర్తనలు శ్రావ్యంగా గానం చేసి అందరినీ ఆకట్టుకున్నారు.


అన్నమాచార్య చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చాగంటి సోమసుందర్

ఆర్థిక వృద్ధికి ప్రణాళికలు

... 5వ పేజీ తరువాయి

మురుగునీటి సమస్య పరిష్కారానికిగాను యూజీడీ పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. తాగునీటి సరఫరా మరింత మెరుగుపర్చేందుకు వీలుగా ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే విశాఖ జిల్లా తలసరి ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉందని, వచ్చే ఏడాదికల్లా రాష్ట్ర స్థూల అభివృద్ధిలో విశాఖ రీజియన్ వాటా 15.7 శాతం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదాయపరంగా రాష్ట్రంలో విశాఖ ప్రథమ స్థానంలో ఉన్నప్పటికీ, ప్రస్తుత ఏడాది జిల్లా వృద్ధి రేటు 9.73గా ఉందంటూ...రాష్ట్ర వృద్ధి రేటు 12.02 కంటే తక్కువగా ఉండడానికి గల కారణాలను కలెక్టర్ వివరించారు. నిర్మాణ రంగం మందకొడిగా ఉందని, ఇసుక, మెటల్ వంటి ముడిసరకు కొరత వచ్చిందన్నారు. రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.1,500 కోట్లుగా నిర్ణయిస్తే ఇంతవరకు రూ.1,100 కోట్లు వచ్చిందన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని వచ్చే ఏడాది నిర్మాణ రంగంపై ఎక్కువగా ఫోకస్ పెడతామన్నారు. జిల్లా ఆదాయంలో సర్వీస్ సెక్టార్ నుంచి 50 శాతం, ఉత్పత్తి రంగం నుంచి 45, వ్యవసాయం నుంచి ఐదు శాతం వస్తుందన్నారు. ఉత్పత్తి రంగంపై మరింత దృష్టిసారించడం వల్ల ఆదాయం పెరిగేలా కృషిచేస్తామన్నారు. రెండు పోర్టుల ద్వారా వ్యాపారం పెరిగితే ఆదాయం వృద్ధి చెందుతుందన్నారు. వచ్చే ఏడాది వృద్ధి రేటు 15 శాతానికి చేరుకోకపోయినా రాష్ట్ర సగటును దాటుతామని పేర్కొన్నారు.

స్మార్ట్ సిటీ పనులు 90 శాతం పూర్తి

స్మార్ట్ సిటీ, ఎన్‌సీఏపీ నుంచి నిధులు విడుదల కావలసి ఉందని, రాష్ట్ర వాటాగా రూ.248.91 కోట్లు బదిలీ చేయాల్సి ఉందని సమావేశంలో కలెక్టర్ వెల్లడించారు. గతంలో మూడు వాయిదాల్లో రూ.129.25 కోట్లు విడుదల చేశారని, వాటితో చేపట్టిన పనులు 90 శాతం పూర్తయ్యాయన్నారు. 2019 నిబంధనల ప్రకారం కోస్తా నియంత్రణ మండలి పరిధిని గుర్తించడానికి ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రూపొందిస్తున్నదని చెప్పారు. మధురవాడ, భీమునిపట్నం మధ్య సీఆర్‌జెడ్-3, సీఆర్‌జెడ్-2లను రీ క్లాసిఫికేషన్ చేయాలని వినతులు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. యారాడ భూముల అభివృద్ధికి న్యాయపరమైన అడ్డంకులు వస్తున్నాయని, ఆ భూముల్లో గంగవరం పోర్టు, రక్షణ శాఖ కార్యాలయాలు ఉన్నాయని, కోర్టులో రిట్ పిటిషన్లు కూడా ఉన్నాయన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలను ఒక గ్రోత్ హబ్‌ను నీతి ఆయోగ్ రూపొందించిన నేపథ్యంలో పలు రంగాల అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. 2047కల్లా 2.5 ట్రిలియన్ డాలర్ల ఆదాయాన్ని రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకున్నందున...విశాఖ రీజియన్‌లో నిర్దేశించిన 715 బిలియన్ డాలర్ల లక్ష్యం చేరుకోవడానికి అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

జిల్లాలో రంగాల వారీగా చూస్తే గ్రాస్ వాల్యూయాడెడ్ (జీవీఏ)లో వ్యవసాయ రంగం వాటా కేవలం ఐదు శాతం మాత్రమే ఉందని పేర్కొంటూ దానిని 10 శాతానికి చేరుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నగదు రూపంలో చూస్తే రూ.68 కోట్లు మాత్రమే వ్యవసాయ రంగం వాటాగా ఉన్నట్టు వెల్లడించారు. జిల్లాలో అనేక కారణాల వల్ల రెండు వేల ఎకరాల బీడు భూములు ఉన్నాయని, వచ్చే ఏడాది 200 హెక్టార్లను సాగులోకి తీసుకువస్తామన్నారు. వరి, చిరుధాన్యాల సాగులో వినూత్న సంస్కరణలు చేపట్టి కొత్త వంగడాలు ప్రవేశపెడతామన్నారు. వరిలో ఎంటీయూ 1224, ఆర్ఎన్ఆర్ 15048, చిరుధాన్యాలలో ఇంద్రావతి, వేగవతి వంటి నూతన రకాలను అందుబాటులోకి తీసుకువచ్చి ఉత్పాదకతను పెంచుతామన్నారు. సూర్యఘర్ పథకం అమలుకుగాను ప్రతి నియోజకవర్గంలో కనీసం పది వేల యూనిట్లు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టిసారించేలా ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తామని కలెక్టర్ వివరించారు.

అలరించిన కథాకచేరి

సీతంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కథాకచేరి ఆహూతులను అలరించింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షుడు శేఖర మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఎందరో మహానుభావులు తమ కథానికలో సమాజ శ్రేయస్సుతో పాటు తెలుగు భాషను సుసంపన్నం చేస్తున్నారన్నారు. కథలు చక్కగా చెప్పడమే కాదు.. ఏం చెబుతున్నామన్నది ముఖ్యమన్నారు.

ప్రవీణ్ మృతికి నివాళి


ప్రముఖ క్రైస్తవ సువార్తీకుడు ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న క్రైస్తవులు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

దొంగ బంగారు, వెండి ఆభరణాల విక్రయానికి యత్నం


అమ్మకానికి తెచ్చిన వెండి పట్టీలు

సీతంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దొంగ బంగారం, వెండి ఆభరణాలను స్వర్ణ దుకాణంలో అమ్మకానికి యత్నించిన తల్లీకూతుళ్లను ద్వారకా క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.... పంజాబ్‌కు చెందిన రాజ్‌పుత్ అనే మహిళ తన కుమార్తెతో కలిసి ద్వారకానగర్‌లోని ఒక బంగారు దుకాణంలో నకిలీ, దొంగ బంగారం, వెండి ఆభరణాలను అమ్మడానికి బుధవారం వెళ్లింది. అయితే ఆ దుకాణంలో ఆభరణాలు పరిశీలించిన ఉద్యోగి ఎక్కడివని అడగడంతో వారు తడబడ్డారు. దీంతో వారు ఆ విషయాన్ని ద్వారకా పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. సీఐ డి.వి.రమణ, క్రైమ్ ఎస్ఐ రాజు సిబ్బందితో వెంటనే అక్కడికి వెళ్లి ఆభరణాలు అమ్మడానికి వచ్చిన వారిని విచారించారు. వారి వద్ద నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారించగా వారు పంజాబ్ నుంచి వచ్చినట్లు, ఆమె పేరు రాజ్‌పుత్‌గా తెలిపింది. ఆమెతో ఉన్న యువతిని తన కుమార్తెగా తెలిపింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీసుల అదుపులో తల్లీకూతుళ్లు


ఆభరణాలు తెచ్చిన మహిళను విచారిస్తున్న సీఐ రమణ

అక్కయ్యపాలెంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సీతంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం చిన్నూరుకు చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కయ్యపాలెం చిన్నూరు సంకువానిపాలేనికి చెందిన షేక్ ఫెరోజ్ (29) తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే చెడు తిరుగుళ్లతో పాటు మద్యం తాగడానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో శుక్రవారం నమాజ్‌కు కూడా రాకపోవడంతో ఫెరోజ్ తండ్రి హుస్సేన్ కొడుకును మందలించాడు. నమాజ్‌కి వెళ్లిన కుటుంబ సభ్యులు రాత్రికి తిరిగి ఇంటికి వచ్చారు. లోపల పరిశీలించగా ఓ గదిలో డోర్ కర్టెన్‌తో ఉరేసుకుని షేక్ ఫెరోజ్ కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు కేకలు వేసి చుట్టుపక్కల వారి సహాయంతో కిందికి దించి సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు.

పేదల కాలనీలో పెద్దోళ్లకు ఇళ్లు!

... 5వ పేజీ తరువాయి

చెందిన పలువురు అభ్యంతరం వ్యక్తంచేశారు. చివరకు గ్రామ సర్పంచ్ మడక అప్పలరాజు స్వయంగా పెందుర్తి తహసీల్దార్, హౌసింగ్ అధికారులను, కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. లేఅవుట్‌లో అధికారికంగా 134 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా అధికార పార్టీ దన్ను ఉండడంతో 178 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని వేర్వేరు దశల్లో ఉన్నాయి. ఇప్పటివరకూ రూ.60 లక్షల వరకూ (యూనిట్ వ్యయం రూ.1.8 లక్షలు) బిల్లులు చెల్లించారు. లేఅవుట్‌లో 134 ఇళ్లు మంజూరుచేస్తే 178 ఇళ్లు ఎలా నిర్మిస్తున్నారని అధికారులు ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. గత ఏడాది ఎన్నికల తరువాత ప్రభుత్వం మారడంతో వైసీపీ అక్రమాలపై కూటమి పార్టీలకు చెందిన నేతలు, స్థానికులు, గ్రామ సర్పంచ్ తమ పోరాటాన్ని ఉధృతం చేశారు. రెండు నెలల క్రితం లబ్ధిదారుల అర్హతపై విచారణ చేయాలని ఆదేశించిన ప్రభుత్వం, ఒక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ప్రకారం గ్రామంలో 134 మంది పేర్లను ఆధార్ కార్డు నంబరుతో విచారణ చేపట్టగా 60 మంది అనర్హులు ఉన్నారని తేలింది. వీరిలో పది మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, సైనికులు ఉన్నట్టు గుర్తించారు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. అయితే ఇంతవరకూ అనర్హులపై చర్యలు తీసుకోలేదు.

అనర్హులను ప్రాసిక్యూట్ చేయాలి

జెర్రిపోతులపాలెం గ్రామంలో పేదల కోసం అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో 134 ఇళ్లు మంజూరుచేశారు. కానీ 178 ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. 134 మంది జాబితాలో సగానికిపైగా అనర్హులున్నారు. మొత్తం వ్యవహారంపై విచారణ చేయాలి. అనర్హులను ప్రాసిక్యూషన్ చేయాలి. వారికి ఇళ్లు మంజూరుచేసిన అధికారులకు చర్యలు తీసుకోవాలి.

మడక అప్పలరాజు, సర్పంచ్, జెర్రిపోతులపాలెం

అనర్హులపై చర్యలు తీసుకుంటాం

జెర్రిపోతులపాలెంలో అనర్హులకు ఇళ్ల కేటాయింపు వ్యవహారం నా దృష్టికి వచ్చింది. సమగ్రంగా విచారణ జరిపి అనర్హులుంటే వారి పేర్లు తొలగించడంతోపాటు రికవరీ చేస్తాం.

సత్తిబాబు, పీడీ, హౌసింగ్ కార్పొరేషన్, విశాఖపట్నం

వైద్యులు సమయపాలన పాటించాలి

... 5వ పేజీ తరువాయి

జరిగేది. ఇప్పుడు డీఎంఈ, డీహెచ్ ఆధ్వర్యంలో జరుగుతోంది. కొన్ని పోస్టులు మేము భర్తీ చేస్తున్నాం. అటువంటి వాటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిబంధనలకు అనుగుణంగా పోస్టులను భర్తీ చేస్తున్నాం. మెరిట్ ఉన్న వారికి మాత్రమే ఉద్యోగాలు వస్తాయి.

కేన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఎంతవరకు వచ్చింది?

ప్రభుత్వం కేన్సర్ రోగులను ముందుగానే గుర్తించేందుకు స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ఇప్పటివరకూ జిల్లాలో 46 శాతం పూర్తయింది. ఈ సర్వేలో భాగంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్లను ముందుగా గుర్తించడంతోపాటు బీపీ, షుగర్ వంటి వాటిని నిర్ధారిస్తున్నాం. అనుమానిత కేన్సర్ కేసులను కేజీహెచ్‌లోని ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌కు తరలించి పరీక్షలు చేయిస్తున్నాం. వచ్చే నెలాఖరు నాటికి సర్వే పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. అర్బన్ ప్రాంతాల్లో ప్రజలు సర్వేకు సహకరించాలి. అలాగే, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆభా) ఐడీ ప్రోగ్రామ్ కూడా నడుస్తోంది. ఆధార్ తరహాలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య ఐడీ ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఏఎన్ఎం ఇంటింటికీ వెళ్లి ఆధార్‌తో అటాచ్ అయి ఉన్న ఫోన్ నంబర్‌ను ఎంటర్ చేసి అభా ఐడీని జనరేట్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఆధార్ తరహాలో వైద్య సేవల కోసం ఈ ఐడీ ఉపయోగపడుతుంది. రోగులు ఆస్పత్రులకు వెళ్లినప్పుడు ఆ నంబర్ చెబితే వారి ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. ఇది మెరుగైన సేవలు అందించేందుకు ఉపకరిస్తుంది.

మీరు ప్రాధాన్యం ఇచ్చే అంశాలు?

ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యం. తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టిసారిస్తున్నా. ఓపీ, ఐపీ సేవలు, డెలివరీలు పెంచాలి. ఫ్యామిలీ ప్లానింగ్ అంటే బిడ్డకు బిడ్డకు మధ్య దూరం పట్ల ప్రజల్లో అవగాహన కలిగించాలి. ఆయా కేంద్రాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా ఈ అంశాలను అడిగి తెలుసుకుంటున్నా. వైద్యులు, సిబ్బంది చెప్పే మాటలు విని వచ్చేయకుండా రోగులతో కూడా మాట్లాడి సేవలు అందుతున్న తీరును తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం. ప్రతిరోజూ నాలుగు నుంచి ఐదు ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం.

ఆస్పత్రులపై పర్యవేక్షణ కొరవడినట్టుంది?

జిల్లాలోని ఆస్పత్రులతోపాటు క్లినిక్‌లు, ల్యాబొరేటరీలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే వాటిపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని రోగుల బంధువులు ఆందోళనలు చేస్తున్నారు. ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. అటువంటి వాటిపై అధికారులతో విచారణ చేయిస్తున్నాం. మా సిబ్బంది ఎప్పటికప్పుడు కొన్ని ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటుంటారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే మాకు ఫిర్యాదులు చేయవచ్చు. రోగికి అందించే వైద్యాన్ని రహస్యంగా ఉంచడానికి వీల్లేదు. కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాలి.

క్లౌడ్ కిచెన్స్ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. మిగిలిన వాటికి ఎటువంటి అనుమతులు లేవు. అదలావుంచితే క్లౌడ్ కిచెన్స్ నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. చిన్నపాటి రూముల్లో, అపరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో తనిఖీలు చేయాల్సిందిగా ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులను ఆదేశించారు. వారం కిందట పది క్లౌడ్ కిచెన్స్‌ను తనిఖీ చేయగా, కొన్నింటికి అనుమతులు లేవని, అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్నారని, నాసిరకం పదార్థాలతో ఆహారాన్ని తయారు చేస్తున్నారని అధికారులు గుర్తించారు. ఆయా క్లౌడ్ కిచెన్స్‌లో నమూనాలను సేకరించి పరీక్షలకు తరలించారు. రిపోర్టులు వచ్చిన తరువాత వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ జీవీబీ నందాజీ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు క్లౌడ్ కిచెన్స్ తనిఖీలు చేస్తామని వెల్లడించారు.

క్లౌడ్ కిచెన్స్ నిర్వహణ ఎలా.?

క్లౌడ్ కిచెన్స్ ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యాయి. ముఖ్యంగా మహిళలు వీటిని ఏర్పాటుచేస్తున్నారు. ఇంటి వద్దే చిన్నపాటి రూమ్‌లో పలురకాల ఆహార పదార్థాలను తయారుచేసి విక్రయిస్తున్నారు. క్లౌడ్ కిచెన్స్‌లో అమ్మకాలన్నీ పూర్తిగా ఆన్‌లైన్ ఆర్డర్లపైనే ఆధారపడి ఉంటాయి. కానీ, కొన్నిచోట్ల నేరుగా కూడా విక్రయిస్తున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్స్ ఉండే వారి ద్వారా క్లౌడ్ కిచెన్ నిర్వాహకులు ప్రచారం చేయించుకుంటుంటారు. ఇంటి వద్ద ఉంటూనే నెలకు రూ.20 వేల నుంచి 30 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది ఇటువైపు ఆసక్తి చూపిస్తున్నారు.

ఈ అనుమతులు తప్పనిసరి

క్లౌడ్ కిచెన్ ఏర్పాటుచేయాలంటే కొన్ని రకాల అనుమతులను తీసుకోవాలి. ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారుల వద్ద ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ తీసుకోవాలి. లేదా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ట్రేడ్ లైసెన్స్ ఉండాలి. ఎవరైనా పనిచేస్తున్నట్టయితే లేబర్ లైసెన్స్, టర్నోవర్‌ను బట్టి జీఎస్టీ సర్టిఫికెట్ ఉండాలి. ఏడాదికి రూ.12 లక్షల టర్నోవర్ దాటితే ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, అంతకంటే తక్కువ ఉంటే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. లైసెన్స్ లేకుండా నిర్వహిస్తే పది లక్షల రూపాయల వరకు జరిమానాతోపాటు కేసు నమోదుచేసే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తే రెండు లక్షల వరకు జరిమానా విధించడంతోపాటు కేసు నమోదుచేస్తారు.

అవగాహన తప్పనిసరి

క్లౌడ్ కిచెన్ ఏర్పాటు చేసేవారిలో దాదాపు మహిళలే అధికంగా ఉంటున్నారు. వారికి ఎటువంటి అనుమతులు తీసుకోవాలన్న దానిపై అవగాహన ఉండడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, వార్షిక టర్నోవర్ రెండు లక్షల రూపాయల కంటే తక్కువగా ఉంటే ఏడాదికి వంద రూపాయలు పెట్టి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ జీవీబీ నందాజీ తెలిపారు. అదే సమయంలో కిచెన్ పరిశుభ్రమైన వాతావరణంలో ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. ఆహార పదార్థాలు నిల్వ లేకుండా చూసుకోవాలని, అప్పుడే ఎటువంటి ఇబ్బందులు ఉండవని నందాజీ పేర్కొన్నారు.

కాలువలోకి వృథాగా తాగునీరు



కాలువలోకి వృథాగా పోతున్న తాగు నీరు

వెంకోజీపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు హెచ్‌బీ కాలనీలో పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద తాగు నీటి కొళాయికి ట్యాప్ లేకపోవడంతో నీరంతా వృథాగా ఇక్కడి కాలువలోకి పోతోంది. సంబంధిత అధికారులుఈ విషయమై దృష్టి సారించి, తాగునీరువృథా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశాంతంగా టెన్త్ ఫిజికల్ సైన్స్ పరీక్ష

ఆరిలోవ, మార్చి26 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలో బుధవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షకు 29 ,405 మంది విద్యారులకు హాజరు కావాల్సివుండగా, వీరిలో 29,247 మంది హాజరైనట్లు తెలిపారు. మరో 158మంది గైర్హాజరు అయనట్టు తెలిపారు. జిల్లా అబ్జర్వర్ దేవానంద రెడ్డి 5 సెంటర్లు, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్ 4 సెంటర్లు స్క్వాడ్ బృందాలు 26 సెంటర్లు సందర్శించినట్టు తెలిపారు.

అలాగే ఓపెన్ స్కూలు పరీక్షలు ఉదయం 9-30 ప్రారంభమై 12-30 గంటలకు ముగిశాయి. వీరికి సాంకేతిక విజ్ఞాన, గృహ విజ్ఞానం పరీక్ష జరిగినట్టు తెలిపారు. సుమారు 837 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 750 మంది హాజరైనట్టు డీఈవో తెలిపారు.

నేటి నుంచి కళాభారతిలో జాతీయ నాటకోత్సవాలు

» 3 రోజుల పాటు నిర్వహణ

మద్దిలపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో గురువారం నుంచి జాతీయ నాటకోత్సవాలు నిర్వహించనున్నట్టు రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి తెలిపారు. ఈ క్రమంలో గుజరాత్‌కు చెందిన రచయిత అర్చిల్ దాగత్ దర్శకత్వంలో 'ఐటెం' నాటిక, 28న అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన రికెన్ దర్శకత్వంలో 'ద సెల్ ఆఫ్ లైఫ్', 29న కేరళకు చెందిన హిస్నం టోంటో దర్శకత్వం వహించిన 'ద టైగర్ మ్యాన్' నాటకాల ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి ఈ నాటకాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నాటక ప్రియులు, కళాభిమానులు నాటకాలు వీక్షించడానికి ఉచిత పాస్‌లు ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే జాతీయ నాటకోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని రమణమూర్తి కోరారు.

సినిమా గైడ్

- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **డ్రాగన్ :** కామేశ్వరి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 16, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 27, బెండకాయలు 28, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 10, క్యారెట్ 32 దొండకాయలు 28, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 28, అల్లం (పాతది)50, బరబాటి 25, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీర దోస 20, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	410
విజయనగరం	414
శ్రీకాకుళం	414

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	88
లైవ్ ధర	108
విత్ స్కిన్	186
స్కిన్‌లెస్	196

ఇరుకు గదిలో ఆస్పత్రి

» 22వ వార్డులో ఇరుకు సందులో యూపీహెచ్‌సీ
» స్థానికులకు సైతం తెలియని వైనం

మద్దిలపాలెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో వైద్య సేవలు అందడం లేదు. ఇక్కడ ఇరుకు వీధిలోని చిన్న ఇంటో ఆస్పత్రి ఏర్పాటు చేశారు. రెండు గదుల ఇంటిలో ఒక బెడ్ రూమ్‌ను వార్డు గదిగా తయారు చేసి ఇన్ పేషెంట్ల కోసం ఒక బెడ్ వేశారు. మరో గదిలో వైద్యుడు, నర్సుల క్యాబిన్‌లతో పాటు మందులు భద్రపరచడానికి వినియోగిస్తున్నారు. పేరుకే ఆస్పత్రిగా ఉన్నా ఇక్కడ రేసపువానిపాలెం వైద్యుడిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఓ నర్సు విధుల్లో ఉంటుంది.

పిఠాపురం కాలనీ నుంచి పీతలవానిపాలేనికి వెళ్లే ఇరుకు వీధిలో ఈ యూపీహెచ్‌సీ ఉంది. అయితే స్థానికుల్లో చాలా మందికి సైతం ఇక్కడ ఆస్పత్రి ఉందన్న విషయమే తెలియదంటే అతిశయోక్తి కాదు.

దాదాపు 30 వేల జనాభా కలిగిన 22వ వార్డులో ప్రజలకు వైద్య సేవలందించే ఆస్పత్రి ఈ స్థాయిలో ఉండడం గమనార్హం. గత ప్రభుత్వ హయంలో పిఠాపురం కాలనీకి మంజూరైన పట్టణ ఆరోగ్యం కేంద్రాన్ని మారికవలసకు తరలించారు.

అప్పటి నుంచి వార్డులో ఆస్పత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. దీంతో వైద్య ఆరోగ్యశాఖాధికారులు.. బైక్‌లు కూడా వెళ్లలేని ఇరుకు సందులో యూపీహెచ్‌సీ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో కనీసం రోజుకు ఓపీ పది కూడా నమోదు కావడం లేదు. రోగులు లేకపోవడంతో ఆదరన లేదన్న నెపంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఉండాల్సిన ఆస్పత్రిని మధ్యాహ్నం 2 గంటలకే మూసేస్తున్నారు.

ప్రజలకు దూరంగా ఆసుపత్రి..

వార్డులోని అన్ని ప్రాంతాలకు పిఠాపురంకాలనీ సెంటర్‌గా ఉంది. విశాలమైన రోడ్డే కాకుండా కళాభారతి పక్కన జీవీఎంసీ భవన సముదాయం ఉంది. గతంలో ఇక్కడేఆస్పత్రి నిర్వహించేవారు. పిఠాపురం కాలనీ సెంటర్ వదిలి ఇరుకు సందులో ఎందుకు యూపీహెచ్‌సీ ఏర్పాటు చేశారో ఎవరికీ అంతుపట్టడం లేదు. తారా మసీదు, శివాజీపాలెం, మంగాపురం కాలనీ, బలరాం నగర్, రాజీవ్‌నగర్ వంటి మాస్ ప్రాంతాల ప్రజలకు కళాభారతి రోడ్డు అందుబాటులో ఉంటుంది. ఎమర్జెన్సీ అయితే ప్రాథమిక వైద్యం అందించడానికైనా, ఆటోలో రోగిని పిఠాపురం కాలనీ తీసుకొచ్చే సౌలభ్యం ఉంది. ఈ ప్రాంతంలో పెద్ద రోడ్డు సదుపాయాలున్న ప్రాంతాలుండగా, ఎవరికీ తెలియని, ఎవరూ గుర్తు పట్టని చోట ఆస్పత్రి ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం ఆరోగ్యశాఖ అధికారులు, స్థానిక కార్పొరేటర్‌కే తెలియాలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ యూపీహెచ్‌సీ వల్ల ఆరోగ్యశాఖకు ఆర్థిక భారమే తప్ప రోగులకు ఎలాంటి ఉపయోగం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అందరికీ అందుబాటులో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పిఠాపురం కాలనీ- పీతలవానిపాలెం మార్గం లోని ఓఇంట్లో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీ



ఇరుకు గదిలో ఏర్పాటు చేసిన డాక్టర్ క్యాబిన్, బెడ్స్

వీనులవిందుగా అన్నమయ్య కీర్తనల గాత్రకచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న శ్రీరామ్

మద్దిలపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో అన్నమాచార్య 522వ వర్ధంతి పురస్కరించుకుని త్యాగరాజ ఆరాధన ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనల ఆలాపన కార్యక్రమం అలరించింది. గాత్ర విద్వాంసులు జొన్నలగెడ్డ శ్రీరామ్ అరుదైన అన్నమయ్య కీర్తనలు గానం చేసి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. 'ఈతడే ముక్తిదోవ..', 'పలు విచారుములేల..', 'గుమ్మనియేడి శృతి..', 'బ్రహ్మకడిగిన పాదము..', 'అంతరంగమేల..', 'ఏ కులజుడైననేమి..', 'నగవుల నిజమని..' 'వీణవాయించేనే..' వంటి కీర్తనలను వీనులవిందుగా ఆలపించారు.

వయోలిన్‌పై హెచ్.రామ్‌చరణ్, మృదంగంపై ఎస్.సుబ్రహ్మణ్యం, తబలాపై ఆనంద్ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో ఆరాధన ట్రస్టు నిర్వహకులు గుమ్ములూరి రాంబాబు, మంతెన సత్యనారాయణ, పైడా కృష్ణప్రసాద్, పిల్లా రమణమూర్తి పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ దుకాణాల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి

చైర్మన్ ప్రణవ్‌గోపాల్



అగ్నిప్రమాదం గురించి తెలుసుకుంటున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

సిరిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏకు చెందిన దుకాణాలు,, వాణిజ్య సముదాయాల్లో తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలు అమర్చాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ ఆదేశించారు. బుధవారం సెంట్రల్ పార్కుఎదురుగా వీఎంఆర్డీఏకు చెందిన షాప్ 14లో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన గురించి తెలుసుకున్న ఆయన, వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, ఇంజనీర్ రామరాజుతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద తీవ్రతను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై వీఎంఆర్డీఏకు చెందిన అన్ని దుకాణాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నోటీసులు జారీ చేసి జరిమానా విధించాలని ఆదేశాలు జారీ చేశారు.

చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాల విక్రయానికి యత్నం

పోలీసుల అదుపులో తల్లీకూతుళ్లు



అమ్మకానికి తెచ్చిన వెండి పట్టీలు



నకిలీ ఆభరణాలు తెచ్చిన మహిళను విచారిస్తున్న సీఐ రమణ

సీతంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను స్వర్ణ దుకాణంలో అమ్మకానికి యత్నించిన తల్లీకూతుళ్లను ద్వారకా క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... పంజాబ్‌కు చెందిన రాజ్‌పుత్ అనే మహిళ తన కుమార్తెతో కలిసి ద్వారకానగర్‌లోని ఒక బంగారు దుకాణంలో నకిలీ, దొంగ బంగారం, వెండి ఆభరణాలను అమ్మడానికి బుధవారం వెళ్లింది. అయితే ఆ దుకాణంలో ఆభరణాలు పరిశీలించిన ఉద్యోగి ఎక్కడివని అడగడంతో వారు తడబడ్డారు. దీంతో వారు ఆ విషయాన్ని ద్వారకా పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు.

సీఐ డీవీ రమణ, క్రైమ్ ఎస్ఐ రాజు సిబ్బందితో వెంటనే అక్కడికి వెళ్లి ఆభరణాలు అమ్మడానికి వచ్చిన వారిని విచారించారు. వారి వద్ద నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారించగా వారు పంజాబ్ నుంచి వచ్చినట్లు, ఆమె పేరు రాజ్‌పుత్‌గా తెలిపింది. ఆమెతో ఉన్న యువతిని తన కుమార్తెగా తెలిపింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

సీతంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం చిన్నూరుకు చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కయ్యపాలెం చిన్నూరు సంకువానిపాలేనికి చెందిన షేక్ ఫెరోజ్ (29) తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే చెడు తిరుగుళ్లతో పాటు మద్యం తాగడానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో శుక్రవారం నమాజ్‌కు కూడా రాకపోవడంతో ఫెరోజ్ తండ్రి హుస్సేన్ కొడుకును మందలించాడు. నమాజ్‌కి వెళ్లిన కుటుంబ సభ్యులు రాత్రికి తిరిగి ఇంటికి వచ్చారు. లోపల పరిశీలించగా, ఓ గదిలో డోర్ కర్టెన్‌తో ఉరేసుకుని షేక్ ఫెరోజ్ కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు కేకలు వేసి చుట్టుపక్కల వారి సహాయంతో కిందికి దించి సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు.

కళాభారతి రోడ్డులో పోకిరీల బెడద

» మద్యం తాగడానికి అడ్డాగా మార్చుకున్న కొందరు యువత
» అటుగా వెళ్లే వారిపై ఆకతాయి చేష్టలు, దురుసు ప్రవర్తన
» చీకటి పడితే రాకపోకలకు స్థానికుల వెనుకంజ
» పోలీసు గస్తీ పెంచాలంటూ వినతి




కళాభారతి ఏరియా నిర్మానుష్యప్రాంతంలో గుంపులుగా చేరిన యువకులు

మద్దిలపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ కళాభారతి రోడ్డులో ఆకతాయిల వేధింపులు ఎక్కువయ్యాయి. నిర్మానుష్యంగా ఉన్న రోడ్డులో యువకులు గుంపులుగా ఉంటూ పాదచారులు, వాహనాదారులకు ఆటపట్టిస్తున్నారు. కళాభారతి రోడ్డులో ఈ నెల 24న చీకటి సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తికి ఇద్దరు ఆకతాయిలు వెనుక నుంచి బైక్‌పై వచ్చి చేతితో అతని వీపుపై గట్టిగా బాదారు. అంతటితో ఆగకుండా మళ్లీ ముందు నుంచి వచ్చి ముఖంపై పిడిగుద్దులు గుద్ది పరారయ్యారు.

గత కొంతకాలం నుంచి పిఠాపురం కాలనీ పార్కు వెనుక రోడ్డులో రోజూ కొందరు యువకులు చేరి గంజాయి సేవిస్తున్నారు. పార్కులో మద్యం సేవించి రాకపోకలు సాగించే వారిపై అనుచితంగా ప్రవరిస్తూ గొడవకు దిగుతున్నారు. దీంతో కాస్త చీకటి పడితే ఈ రోడ్డులో ప్రయాణాలు చేయడానికి స్థానికులు భయంతో వెనుకంజ వేస్తున్నారు. పోలీసులు స్పందించి మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్ల ముమ్మర సాధన







బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసి వెళ్తున్న అభిషేక్ పూరల్, సాధనలో ఢిల్లీ క్రీడాకారులు, మిచెల్ స్టార్క్ సమాలోచనలు

విశాఖపట్నం, స్పోర్ట్సు, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): హోం గ్రౌండ్‌లో జరిగిన తొలిమ్యాచ్‌లో విజయం సాధించిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు ఈనెల 30న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న మ్యాచ్‌కు సమాయత్తమవుతున్నారు.

రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించడమే ధ్యేయంగా ముమ్మర సాధన చేస్తున్నారు.

బుధవారం మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో కెప్టెన్ అక్షర పటేల్, అశుతోష్ శర్మ, మిచెల్‌స్టార్క్, డుప్లెసిస్, సమీర్ రజ్వి, విపరాజ్ నిగమ్, పూరన్, కరుణ్ నాయర్, కులదీప్ యాదవ్, ముకేష్‌కుమార్, త్రిపూర్ణ విజయ్, మోహిత్ శర్మ, మెక్‌గుర్క్, అభిషేక్ పోరెల్, జాక్ ఫ్రాసెర్, హ్యరీ బ్రోక్, దర్శన్ నల్కాండ్, అజయ్ మండల్, మన్వత్‌కుమార్, మహదేవ్‌తివారి, నటరాజన్, దుష్మంత చమీరా తదితరులు ఉత్సాహంగా ప్రాక్టీసులో పాల్గొన్నారు.

పార్కు ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటరు గొలగాని మంగవేణి తదితరులు

ఎంవీపీ కాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులో రూ.40 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న ఏటీసీ పార్కు ఆధునీకరణకు పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పార్కు పేరిట ఉన్న స్థలంలో ఎలాంటి అభివృద్ధి లేదు. కార్పొరేటర్ గొలగాని మంగవేణిపోలారావు వినతి మేరకు జీవీఎంసీ నిధులు మంజూరు చేసింది. దీంతో ఇక్కడ పార్కును ఆధునీకరించనున్నారు. ఈ క్రమంలో పార్కులో పాత్ వే, ల్యాండ్ స్కేపింగ్ వంటివి చేపట్టనున్నారు. ఈ పనులకు ఎమ్మెల్యే వెలడపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, తెలుగుదేశం నాయకులు గొలగాని పోలారావు, లక్ష్మణరావు, మాసేను, సత్తిబాబు, అప్పలరాజు, సత్యం, రాము, జీవీఎంసి సహాయ ఇంజనీరు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో చెత్తాచెదారం తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కాలువలో పూడికలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

పెదవాల్తేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట చేపల మార్కెట్ వద్ద గల డ్రైనేజీలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. ఇక్కడి డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి మురుగు నీరు ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. 'పెద జాలారిపేటలో అధ్వానంగా డ్రైనేజీలు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. మురుగు పారకపోవడంతో ఇన్నాళ్లు ఈ ప్రాంతంలో దుర్గంధం నెలకొంది. తాజాగా పారిశుధ్య సిబ్బంది కాలువలు శుభ్రం చేయడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

రంజాన్ పండుగ తేదీపై ఇంకా స్పష్టత రాలేదు : డీఈవో

ఆరిలోవ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగ ఏ రోజు అనే విషయమై ఇప్పటి వరకూ స్పష్టత రాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. రంజాన్ పండుగ ఈ నెల 31న జరిగితే పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష ఏప్రిల్ 1న ఉంటుందని, ఒక వేల రంజాన్ పండుగ ఏప్రిల్ 1న నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటిస్తే హాల్ టిక్కెట్లలో ప్రకటించిన విధంగా మార్చి 31న యథావిధిగా పరీక్ష ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అన్ని పాఠశాలల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తలిదండ్రులు గ్రహించాలని ఆయన కోరారు.

3 కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం

» ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
» సుమారు 11 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. 5 లక్షల నగదు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణరావు



స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

పెందుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి పోలీసు స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల జరి గిన చోరీ కేసులకు సంబంధించి పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి సుమారు 11 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. 5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్ ఏసీపీ డి, లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. గత నెల 14న పెందుర్తి లోని ఓ జ్యూవెలరీ షాపులో ఆభరణాలు కొనుగోలుకు వచ్చిన దంపతులు బంగారు ఉంగరాలు చూపించమని అడిగారు. యజమాని రకరకాల మోడల్స్ చూపించగా, ట్రేలో ఉంచిన ఉంగారాల్లో 5 గ్రామాల ఉంగరం చోరీ అక్కడి నుంచి పరారయ్యారు. యజమాని డెక్క రమణ పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రైం పోలీసులు విచారణ జరిపారు. ఈమేరకు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం మండలం రైస్‌పేట గ్రామానికి చెందిన దంపతులు కొవ్వూరి మాణిక్యేశ్వరి(25), పిన్నింటి గణేశ్ (27) చోరీకి పాల్పడ్డారని నిర్ధారించి, వారిని అరెస్టు చేసి, 12 గ్రాముల విలువైన ఐదు బంగారు ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు నెలల్లో వారిపై పెందుర్తి, ఎలమంచిలి, గోపాలపట్నం, కంచరపాలెం, గాజువాక, భీమునిపట్నం, పీఎంపాలెం స్టేషన్ల పరిధిలో పలు కేసులు నమోదైనట్టు ఏసీపీ తెలిపారు. అలాగే గత నెల 17న నాయుడుతోట సమీ పంలోని సాయిమాధవ్‌నగర్‌కు చెందిన ఇంట్లో వివాహిత బండారు శ్రావణి ముఖంపై పెప్పర్ జల్లి పిడిగుద్దులుతో కొట్టి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు తాడు చోరీ చేసిన వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు సాయిమాధవ్‌నగర్‌కు చెంది జంజారి అంబేడ్కర్ (20) అని ఎస్ఐ చెప్పారు. అతని నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకునారు. మరో కేసుకు సం బంధించి పినగాడిలో ఉంటున్న షేక్ హసీనా (50) నుంచి 8 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. 5 లక్షలు నగదు రికవరీ చేశారు. అప్పుల బాధ నుంచి తప్పించుకునేందుకు ఇంట్లో భారీ చోరీ జరిగిందని అబద్ధపు ఫిర్యాదు చేశానని బాధిత మహిళ పోలీసులకు తెలిపింది. దీంతో దొంగలు చోరీ చెప్పినట్టు బంగారం, వెండి, నగదును ఆమె పోలీసులకు అప్పగించింది. కేసులను చేధించి నిందితులను అరెస్టు చేసిన క్రైమ్ ఎస్ఐ సూరిబాబు, ఏఎస్ఐ మూర్తి, హెచ్‌సీ నాగరాజు , పీసీలు కిశోర్, పైడిరాజు, శివ ప్రసాద్, దేవుడునాయుడు, నితీశ్ కుమార్, హైమావతిని ఉన్నతాధికారులు అభినందించారు.

సహకార విశ్వవిద్యాలయంతో ఎంతో మేలు

» లోక్‌సభలో ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): దేశంలో సహకారరంగాన్ని బలోపేతం చేయడానికి లోక్‌సభలో బుధవారం ప్రవేశపెట్టిన త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయం బిల్లుకు ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ మద్దతు తెలిపారు. సహకార రంగంలో పరిశోధన, సామర్థ్య నిర్మాణం, గ్లోబల్ ఎక్స్‌లెన్స్‌ను పెంపొందించేందుకు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రస్తుతం దేశంలో 8 లక్షలకు పైగా సహకార సంఘాలున్నప్పటికీ వాటిలో చాలా సంస్థలు నిర్వహణ సమస్యలతో పోరాడుతున్నాయన్నారు. ఏపీలో 17 వేల సహకారసంఘాలుండగా సరైన శిక్షణ అందించే అవకాశాలు లేవన్నారు. కీలకమైన మత్స్యకార సంఘాలకు ఈ విశ్వవిద్యాలయం ద్వారా ప్రయోజనం కలుగుతుందన్నారు. పనిచేయని సహకార సంఘాలను ప్రోత్సహించేందుకు శిక్షణ అవసరమన్నారు. ప్రస్తుతం 18 శాతం సహకార సంఘాలు నష్టాల్లో ఉన్నాయని, వీటిని లాభదాయకంగా మార్చేందుకు అధ్యయనం జరిపి మోడల్ ప్రాక్టీసెస్ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సహకార రంగంలో ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ పెంపొందించేందుకు కీలక ముందడుగన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.57 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుల ద్వారా గడచిన 21 రోజుల్లో సుమారు రూ.1.57 కోట్ల ఆదాయం సమకూరింది. ఈవో కె.సుబ్బారావు సారథ్యంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ పర్యవేక్షణలో బుధవారం పరకామణిలో హుండీల ఆదాయం లెక్కించారు. హుండీల ద్వారా రూ1,57,71,152లు నగదు, 63 గ్రాముల స్వర్ణం, 9.725 కిలోల రజితం ఆభరణాల రూపంలో ఖజానాకు లభించినట్టు అధికారులు ప్రకటించారు. 51 యూఎస్‌ఏ డాలర్లు, మలేషియా కు చెందిన 27 రింగిట్స్, ఖతార్‌కు చెందిన ఏడు రియల్స్, యూఏఈకి చెందిన 20 దీరమ్స్, టర్కీ, సౌత్ ఆఫ్రికా, తదితర దేశాలకు చెందిన కరెన్సీ ఖజానాకు సమకూరింది. హుండీ లెక్కింపులో పలువిభాగాల ఏఈఓలు, పర్యవేక్షణాధికారులు, సేవాసంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ బజార్‌గా ఎండీగా ప్రవీణ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రవీణ

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కోఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్ బజార్) మేనేజింగ్ డైరెక్టర్‌గా ప్రవీణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆమె జిల్లా సహకార శాఖాధికారిగా పనిచేస్తున్నారు. గత ఎండీ శ్రీనివాసరాజును అమరావతిలోని కమిషనరేట్‌కు సరండర్ చేసిన నేపథ్యంలో ప్రవీణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అనేక ఆర్థిక అవకతవకలతో ప్రతిష్ఠ కోల్పోయిన సూపర్ బజార్‌ను గాడిన పెట్టాల్సిన బాధ్యత ఆమెపై ఉంది.

ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు

ఎంవీపీ కాలనీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ జె.మురళి తెలిపిన వివరాల మేరకు జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని బాలిక (15) ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమె ఇంటి సమీపంలోని సీహెచ్ సీతయ్య (23) ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబరచుకున్నాడు. అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లిన బాలిక గర్భవతి అని వైద్యులు తెలపడంతో బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు యువకుడిపై ఎంవీపీ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులందరికీ అప్పన్న నిజరూప దర్శనం

» దేవదాయశాఖ కమిషనర్ కోడూరు రామచంద్రమోహన్



కమిషనర్‌ను సత్కరిస్తున్న ఈవో, తదితరులు

సింహాచలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భక్తులందరికీ వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం కల్పించడమే ధ్యేయమని దేవదాయ శాఖ కమిషనర్ కోడూరు రామచంద్రమోహన్ తెలిపారు. చందనోత్సవ నిర్వాహణపై బుధవారం అధికారులకు పలు సూచనలిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చందనోత్సవం విజయవంతానికి ఏప్రిల్ మొదటి వారంలో రెవెన్యూ, దేవదాయ, హోం శాఖ మంత్రులు సింహగిరిపై క్షేత్రపరిశీలన చేసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని చెప్పారు. ఉత్సవ నిర్వాహణకు ఎస్‌ఓపీని ప్రభుత్వం అందించిందన్నారు. దాని ఆధారంగా అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయపరచుకుని ప్రణాళికతో సాగుతామన్నారు. గతంలో లోటుపాట్లపై అధ్యయనం చేసి సరిదిద్దే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రొటోకాల్ దర్శనాలతో సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామన్నారు. చందనయాత్రలో సుమారు లక్షన్నర మంది భక్తులు పాల్గొంటారని, క్యూల ఏర్పాటు, తాగునీరు, ట్రాఫిక్ ఇక్కట్ల తొలగింపుపై దృష్టి సారిస్తామన్నారు. అంతకుముందు కమిషనర్ స్వామిని దర్శించుకున్నారు. ఈవో సుబ్బారావు ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం, అంతరాలయంలో పూజల తరువాత అర్చకులు శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలివ్వగా ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

మహిళల చేతిలో శక్తి



శక్తివంతమైన యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

» ఫోన్ షేక్‌చేస్తే.. పోలీసులకు అలెర్ట్ మెసేజ్
» ట్రావెల్ మ్యాప్‌తో నిమిషాల్లో రక్షణ
» యాప్‌లోనే ఫిర్యాదు చేసుకునే అవకాశం
» కుటుంబ కౌన్సెలింగ్ రిక్వస్ట్ చేసుకునేందుకు వీలుగా సౌలభ్యం
» వాట్సాప్ సేవలు కూడా లభ్యం
» ఐదు మిలియన్లు దాటిన యాప్ డౌన్‌లోడ్లు

(మద్దిలపాలెం, ఆంధ్రజ్యోతి)

మద్దిలపాలెం క్రాంతినగర్‌కు చెందిన యువతి దొండపర్తిలో తాను పనిచేసే షోరూమ్‌కు వెళ్లడానికి సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కింది. గమ్య స్థానం దగ్గరవుతున్నప్పటికీ డ్రైవర్ ఆటో ఆపకుండా గాజువాక తీసుకెళ్లడానికి ప్రయత్నించాడు. ఏం చేయాలో తెలియక రైల్వే ఆస్పత్రి సమీపంలో ఆటోలోంచి దూకి కిడ్నాప్ నుంచి తప్పించుకుంది. కానీ ఈ ఘటనలో తీవ్రంగా గాయపడింది.


రామ్‌నగర్‌లో నివాసముంటున్న భర్తభార్యలు రాత్రి సినిమా చూసి ఇంటికి వెళ్తుండగా ఇద్దరు రౌడీషీటర్లు వెంటపడ్డారు. ఇంటిలోపలికి వెళ్లినా వదలకుండా దాడి చేశారు. మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు.

పూర్ణామార్కెట్ రంగిరీజు నివాసులైన దంపతులు, కుమార్తె షాపింగ్ నుంచి ఇంటికి వెళ్తుండగా గంజాయి మత్తులో ఆకతాయిలు వెంబడించారు. వారిపై దాడి చేసి, వివాహిత చీరను చించేశారు. మహిళ సోదరుడు వచ్చి అడ్డుకునే యత్నంలో అతడిని గాయపరిచారు.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి సంఘటనలు నగరంలో నిత్యకృత్యమవుతున్నాయి. వాటి నుంచి తక్షణ రక్షణ పొందేందుకు అవకాశం లేక బాధితులు బలవుతున్నారు. ఇలాంటి సమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టే యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. అదే శక్తి యాప్. మహిళ రక్షణకు ఉద్దేశించి రూపొందించిన ఈ యాప్‌కు ఆధునిక సాంకేతికతను జోడించి, అనేక ఫీచర్లను అందుబాటులోకి తీసుకురావడంతో ఇప్పుడు మహిళలు ఎక్కడ ఉన్నా వారి వెంట పోలీసు రక్షణ ఉన్నట్టే. పోలీసు శాఖ ఎన్నో ఫీచర్లతో యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అత్యవసర, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఫోన్ ఊపినా చాలు లొకేషన్‌తో సహా పోలీసులకు అలెర్ట్ మెసేజ్ వెళ్తుంది. మహిళల ఫోన్‌లో శక్తి యాప్ ఉంటే పోలీస్ రక్షణ వెంట ఉన్నట్టే. ఇన్ని ఫీచర్లను పొందుపరచడంతో ఈనెల 6న గూగూల్ ప్లేస్టోర్‌లోకి వచ్చిన యాప్ ఐదు రోజుల్లోనే ఐదు మిలియన్ల కంటే ఎక్కు డౌన్‌లోడ్లు అయ్యాయి.

ట్రాక్ మై ట్రావెల్ క్లిక్

శక్తియాప్ ఇన్‌స్టాల్ చేసుకుని ఫోన్ నంబర్‌తో లాగిన్ అయిన తరువాత ఓటీపీ నమోదు చేస్తే వివరాలు పూరించే ఇంటర్‌ఫేస్ వస్తుంది. అక్కడ పేరు, చిరునామా, ఏరియా పోలీస్‌స్టేషన్ ఎంటర్ చేశాక మరో ఇంటర్‌ఫేస్‌కు వెళ్లి సమాచారం అందించడానికి ఐదుగురు వరకు బంధువుల ఫోన్ నంబర్లు ఎంటర్ చేయడంతో లాగిన్ ప్రక్రియ పూర్తవుతుంది. తర్వాత మహిళలు ప్రయాణం చేసే ముందు యాప్ ఓపెన్ చేసి ట్రాక్ మై ట్రావెల్ ఆప్షన్ సెలక్ట్ చేసుకుంటే న్యూ ట్రాక్ రిక్వెస్ట్ వస్తుంది. అందులో ప్రస్తుత లొకేషన్, వెళ్లాల్సిన ప్రాంతం, వాహనం నంబరు నమోదు చేస్తే పోలీస్ కంట్రోల్ రూమ్‌లో మనం ప్రయాణం చేసే వాహనం గూగూల్ మ్యాప్‌లో కనిపిస్తుంది. మనం సెలక్ట్ చేసుకున్న గమ్యస్థానానికి వాహనం వెళ్తోందో లేదో పోలీసులు గమనిస్తారు. వేరే మార్గంలో వెళ్తే వెంటనే అలెర్ట్ చేస్తారు.



యాప్‌లోనే ఫిర్యాదు...

మహిళలు పోలీస్‌స్టేషన్లకు వెళ్లకుండానే శక్తియాప్ ద్వారా ఫిర్యాదు చేసుకునే ఫీచర్ కూడా అందుబాటులోకి తెచ్చారు. యాప్‌లో గివ్ ఏ కంప్లైట్ ఆప్షన్‌లోకి వెళ్లి ఫిర్యాది జిల్లా, ఏరియా పోలీస్‌స్టేషన్ ఎంపిక చేసుకోవాలి. ఫిర్యాదు చేస్తున్న అంశంతో పాటు వివరాలు ఎంటర్ చేయాలి. ఇమేజ్ అప్‌లోడ్ వద్ద క్లిక్ చేసి ఫిర్యాదు రాసిన కాగితాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్ సిబ్బంది బాధితులను సంప్రదించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. సైబర్ నేరాలు, ఫొటో మార్ఫింగ్, కిడ్నాప్, బాల్య వివాహాలు, అత్యాచారం, దాడులు, వేధింపులు తదితర నేరాలపై యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వ్యక్తిగత కుటుంబవ్యవహారాల్లో పోలీస్ కౌన్సిలింగ్ అవసరమనుకుంటే శక్తియాప్ ద్వారా రిక్వెస్ట్ చేసుకోవచ్చు. కుటుంబ తగాదాలు, భార్యాభర్తల మధ్య గొడవలు, గృహహింస వంటి వ్యక్తిగత వ్యవహారాల్లో మహిళలు యాప్ ద్వారా కౌన్సెలింగ్ కోరితే ఏరియా పోలీస్‌స్టేషన్ నుంచి సిబ్బంది ఇంటికి వచ్చి బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

ఫోన్ షేక్ చేస్తే అలెర్ట్...

శక్తియాప్‌లో ముఖ్యమైన ఫీచర్ హ్యాండ్ గెస్చర్. యాప్‌లోని పర్సనల్ ఇన్ఫర్మేషన్‌లో ఉండే ఈ ఆప్షన్ ఆన్ చేసిఉంటే ఫోన్ షేక్ చేస్తే చాలు పోలీసులకు అలెర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది. కిడ్నాప్ యత్నం సమయాల్లో ఇది చాలా ఉపయోగంగా ఉంటుంది. పోలీస్ అవసరం ఉన్నప్పుడు యాప్ ఓపెన్ చేసి ఎస్‌వోఎస్ ఆప్షన్‌పై వేలితో నొక్కితే 10 సెకన్ల వీడియో, ఆడియో రికార్డై సంఘటన స్థలం లొకేషన్‌తో సహా పోలీస్ కంట్రోల్ రూమ్, లాగిన్‌లో నమోదు చేసుకున్న సన్నిహితుల ఫోన్ నంబర్లకు చేరిపోతుంది. దీంతో బాధితుల పరిస్థితి తెలుసుకుని సమీపంలోని పోలీసులు నిమిషాల్లో ప్రత్యక్షమవుతారు. ప్రమాదకర సమయంలో ఫోన్‌లో యాప్ ఓపెన్ చేసి ఎస్‌వోఎస్ ఆప్షన్ క్లిక్ చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు ఫోన్ ఊపితే చాలు పోలీసులకు అలెర్ట్ వెళ్తుంది. అందుకే ప్రయాణ సమయంలో హ్యాండ్ గెస్చర్ ఆప్షన్ ఆన్‌చేసి ఉంచితే పోలీస్ భద్రతలో ఉన్నట్టే.

అందుబాటులో పోలీస్ కాంటాక్ట్స్...

శక్తియాప్‌లో పోలీస్ అధికారుల కాంటాక్ట్ నంబర్లు ఉన్నాయి. జిల్లా పోలీస్ స్టేషన్ ఎంపిక చేసుకుంటే అక్కడ అధికారుల నంబర్లు కనిపిస్తాయి. నివాసముంటున్న ఏరియా ఏ పోలీస్‌స్టేషన్ ఎంతదూరంలో ఉందో తెలుస్తుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాలంటే అక్కడ పరిధి పోలీస్‌స్టేషన్, ఎన్ని కిలోమీటర్ల దూరంలో ఉందో యాప్‌లో కనిపిస్తుంది. అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిల ఆగడాలపైనా ఫిర్యాదు చేయొచ్చు. పోలీస్ సేవలతో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ సేవలు కూడా శక్తియాప్ ద్వారా పొందే అవకాశం కల్పించారు.

విశాఖ ఉక్కుకు సీఎండీని నియమించరా?

» ఇన్‌చార్జి సీఎండీతో అన్నీ సమస్యలే
» ఉక్కు శాఖా మంత్రికి పోరాట కమిటీ లేఖ

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు తక్షణమే పూర్తి స్థాయి సీఎండీని నియమించాలని ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామికి విశాఖ ఉక్కు పోరాట కమిటీ బుధవారం లేఖ రాసింది. ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి సీఎండీ అజిత్ కుమార్ సక్సేనా మాంగనీస్ ఐరన్‌ఓర్ ఇండియా లిమిటెడ్ సీఎండీగా ఉన్నారని, అక్కడ ఎక్కువ సమయం గడుపుతూ విశాఖలో అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. విశాఖ ఉక్కును కష్టాల నుంచి గటెక్కించడానికి కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థిక సాయం చేసిందని, కార్మికులు కూడా కష్టపడి 110 శాతం ఉత్పత్తి తీస్తున్నామని పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సీహెచ్.నరసింగరావులు పేర్కొన్నారు. త్వరలో మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభించాల్సి ఉందని, దానికి కీలకమైన నిర్ణయాలు తీసుకోవలసి ఉందన్నారు. అయితే అటు ఉత్పత్తి, ఇటు కార్మికులకు సంబంధించిన ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఇన్‌చార్జి సీఎండీ అందుబాటులో ఉండడం లేదని, బోర్డు కూడా సమావేశం కావడం లేదని ఆరోపించారు. ఆయన పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగిసిపోతున్నందున కొత్త సీఎండీని నియమించాలని, పూర్తిస్థాయి అధికారిని వేయాలని డిమాండ్ చేశారు.

శక్తిమణికి అడ్డంకులు

వాస్తవానికి ఉక్కు సీఎండీగా ఫెర్టిలైజర్స్ కంపెనీ ఫైనాన్స్ డైరక్టర్ శక్తిమణిని బోర్డు ఇప్పటికే ఎంపిక చేసింది. అయితే ఆయన విశాఖ స్టీల్‌ప్లాంటులో బాధ్యతలు స్వీకరించకుండా కొన్ని దుష్టశక్తులు అడ్డుపడుతున్నాయని కార్మిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలలు ఇన్‌చార్జి సీఎండీగా కొనసాగడానికి సక్సేనా ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. పూర్తిస్థాయి సీఎండీని నియమిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఈ నేపథ్యంలోనే లేఖ రాసినట్టు సమాచారం.

బాలికపై లైంగిక దాడి

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడి జరిగింది. బాలికపై ఆమె నివాసం ఉంటున్న ప్రాంతానికి చెందిన ఒకరు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇటీవల బాలిక తల్లిదండ్రులు గుర్తించారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలంటూ బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోక్సో చట్టపరిధిలోని కేసు కావడంతో మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీచేశారు. మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోక్సో కేసు కావడంతో వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి హేయమైన చర్య

» గిగా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జగన్



సమావేశంలో మాట్లాడుతున్న జగన్, తదితరులు

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ డెలివరీ బాయ్‌పై ఆక్సిజన్ టవర్‌లోని వ్యక్తి దాడికి పాల్పడడం హేయమైన చర్యని, బట్టలు విప్పించి మరీ హింసించడం దారుణమని ఆలిండియా గిగా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.జగన్ పేర్కొన్నారు. జగదాంబ జంక్షన్ వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో బుధవారం గిగా వర్కర్స్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజలకు ఆహారం, మెడిసిన్ సకాలంలో ఇంటికి తెచ్చి అందిస్తున్న గిగా వర్కర్స్‌కు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆక్సిజన్ టవర్స్‌లో గతంలో పనిచేసే మహిళపై కూడా ఇదే తరహాలో దాడికి పాల్పడ్డారని, ఇప్పుడు డెలివరీ బాయ్‌పై దారుణంగా వ్యవహరించడం గమనార్హమన్నారు. పోలీసులు ఈ కేసుపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. గిగా వర్కర్స్‌కు ఇబ్బందులున్నాయని సదరు సంస్థలకు చెప్పినా వీరిపైనే చర్యలు తీసుకుంటున్నారన్నారు. సీఐటీయూ నేత మణి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిగా వర్కర్, స్విగ్గీ రైడర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆక్సిజన్ టవర్‌లో సహచరుడు అన్నా అని పిలిచినందుకు దాడికి పాల్పడ్డారన్నారు. ఆక్సిజన్ టవర్స్‌కు డెలివరీ ఇవ్వకూడదని తాము ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామన్నారు. సమావేశంలో గిగా వర్కర్స్ బంగార్రాజు, ఎం.శ్రీనివాస్, ఎం.రాజేష్, ఎస్.చక్రవర్తి, రమేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో షెడ్డు తొలగించిన రెవెన్యూ అధికారులు

» కేవలం 108 గజాల ఆక్రమణపైనే చర్యలు
» మరో 372 గజాలు ఇతరుల చేతుల్లోనే
» వైసీపీ నేత కుమారుడు, అనుచరులది కావడంతో వదిలేశారని ఆరోపణలు



కల్యాణమండపం కోసం వేసిన షెడ్డు తొలగిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సర్వేనంబరు 43/1లోని ప్రభుత్వభూమిని ఆక్రమించి నిర్మించిన కల్యాణ మండపం షెడ్‌లను పెదగంట్యాడ రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. సర్వేనంబరు 45లోని 1,700 చదరపు గజాల జిరాయితీ భూమిని ఆనుకుని సర్వేనంబరు 43/1లో సుమారు 480 గజాల ప్రభుత్వ భూమి ఉంది. జిరాయితీ భూమిని పెదగంట్యాడకు చెందిన ఐదుగురు కొనుగోలుచేశారు. భూమిని విక్రయించిన వ్యక్తి దానిని ఆనుకుని ఉన్న ప్రభుత్వభూమిని కలిపి గతంలోనే ప్రహరీ నిర్మించారు. జిరాయితీ భూమిని కొంటే ప్రభుత్వభూమి కలిసిపోతుందని గుర్తించిన గాజువాకకు చెందిన వైసీపీ నేత కుమారుడు వాటా ఇవ్వాలని పట్టుబట్టాడు. అప్పటికి వైసీపీ అధికారంలో ఉండడంతోపాటు తన తండ్రి ప్రజాప్రతినిధి కావడంతో దర్పాన్ని ప్రదర్శించాడు. దీంతో వారు వాటా ఇచ్చారు. భూమి రిజిస్ట్రేషన్ తర్వాత కొనుగోలుచేసిన భూమిని ఆనుకుని 480 గజాలు ప్రభుత్వ భూమి ఉన్నందున భూమి విలువలో సగం తనకు ఇవ్వాల్సిందేనని, లేదంటే ప్రభుత్వానికి అప్పగించాలని బ్లాక్‌మెయిల్ చేసి, గజానికి రూ.15వేలు చొప్పున రూ.45 లక్షలు వసూలుచేశాడు. కొనుగోలుచేసిన భూమిలో వైసీపీ నేత కుమారుడి స్నేహితుడు ఇటీవల కల్యాణ మండపం కోసం షెడ్ నిర్మాణం ప్రారంభించాడు. దీనిపై ఈనెల 11న 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రభుత్వభూమి కబ్జా' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పెదగంట్యాడ రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో సర్వే చేసి, సర్వేనంబరు 43/1లో 480 గజాల ప్రభుత్వ స్థలం ఉందని, అందులో 108 గజాలను ఆక్రమించి కల్యాణ మండపం నిర్మిస్తున్నట్టు నిర్ధారించారు. వారంరోజుల్లోగా ఆక్రమణలను తొలగించాలని నోటీసులు ఇచ్చారు. నిర్మాణదారుల నుంచి స్పందన లేకపోవడంతో బుధవారం యంత్రాలు, పోలీసుల సాయంతో తొలగించారు.

మిగిలిన ఆక్రమణలపై చర్యలేవీ?

సర్వేనంబరు 45/1లో 480 గజాల ప్రభుత్వ స్థలం ఉందన్న రెవెన్యూ అధికారులు కేవలం 108 గజాల్లో ఆక్రమణల తొలగింపునకే పరిమితం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ నేత కుమారుడి నుంచి ఫోన్ రాగానే అధికారుల దూకుడు తగ్గిందని ఆరోపిస్తున్నారు. మిగిలిన ప్రభుత్వభూమిలో ఆక్రమణలు తొలగించి, బోర్డు పెడతారని భావిస్తే షెడ్డు తొలగించి చేతులు దులుపుకోవడం ఆశ్చర్యం కలిగించిందంటున్నారు. మిగిలిన ప్రభుత్వ భూమి వైసీపీ నేత కుమారుడితో పాటు అతని సన్నిహితుల ఆక్రమణలో ఉండడంతో వాటి జోలికి వెళ్లలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొత్తం ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

28 వరకు ఉచిత డీఎస్సీ శిక్షణకు వెబ్ ఆప్షన్ గడువు

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు ఈ నెల 28లోగా ఫేజ్-2 వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు కె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులు వారి ప్రాధాన్యతల ప్రకారం కోచింగ్ సంస్థలు కేటాయించడానికి సర్వీసెస్ జ్ఞానభూమి పోర్టల్ అందుబాటులో ఉందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 28లోగా వెబ్ ఆప్షన్ ద్వారా గుర్తింపు పొందిన శిక్షణ సంస్థలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.